పై మూఁడుగ్రంథములును విజయనగరమునందలి ఆంధ్రవిజ్ఞానసమితి ప్రచురణములు. ఈసమితివా రిదివఱలో వెలిదిండ్ల వేంకటపతిప్రణీతమగు రాధామాధవసంవాదమును ప్రథమప్రచురణముగఁ బ్రకటించియున్నారు. ఈసమితి కధ్యక్షులు భాషాభిమానులును, ఉదారస్వభావులును, శ్రీవిజయనగరసంస్థానము చీఫ్ యింజనీరు గానున్న శ్రీవేపకొమ్మ గురు వేంకటసుబ్బయ్యగారు. వీరలు శృంగారగ్రంథమాలాప్రకాశకులగు శ్రీ గంటి సూర్యనారాయణశాస్త్రిగారియొక్కయు విజయనగరవాస్తవ్యులగు తదితరపండితులయొక్కయు సహాయమున ఆంధ్రవిజ్ఞానసమితి నేర్పఱచి గ్రంథములఁ బ్రచురించుచున్నారు. వీ రీసమితి యాదాయము నంతయు గ్రంథప్రచురణమునకు గ్రంథకర్తలకుఁ బ్రాచీనగ్రంథసంపాదనమునకును వినియోగింతుమని తెలిపియున్నారు. ఆయుద్దేశ్య మెంతయుఁ బ్రశంసనీయము. భాషాభిమాను లీసమితిలోఁ బోషకులును,చందాదారులునై వీరి యుద్యమమునకుఁ జేయూఁత నొసంగుదురుగాక.

పై గ్రంథములందు విస్మృతకళింగాంధ్రకవు లనునది గ్రంథకర్తలచే నిదివఱలో వ్యాసరూపమునఁ బ్రకటింపఁబడియున్నది. కొన్ని యీ పత్త్రికయందును, మరికొన్ని విజయనగరకళాశాలా పత్త్రికయందును బ్రకటితములు. వానిని గ్రంథరూపమునఁదిరిగి ముద్రించుట యాంధ్రవాఙ్మయచరిత్రపరిశోధకుల కెంతయు నుపయోగకరము. ఇందుఁ గళింగదే

శమునకు (నేఁటివిశాఖపట్టణము, గంజాముజిల్లాలకుఁ) జెందిన పదునైదు కవీశ్వరులనుగూర్చి గ్రంథకర్తలు మనకు విపులముగఁ దెలిపియున్నారు.

రెండవగ్రంథమగు వాల్మీకిచరిత్ర మిదివఱలోఁ జిత్రాడ యముద్రితాంధ్రగ్రంథసర్వస్వమువారిచే ముద్రింపఁబడినది. కవియగు తంజావూరి రఘునాథభూపాలుని గూర్చియు, నతని యాస్థానముననున్న చేమకూరవేంకటకవి మొదలగు కవీశ్వరులనుగూర్చియు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు చక్కని పీఠికను వ్రాసియున్నారు. వాల్మీకిచరిత్రము మృదుమధురమై దక్షిణాంధ్రవాఙ్మయమున నగ్రస్థానమును వహించుచున్నది. కవిత్వమునుగూర్చి రఘునాథభూపాలుఁడు చెప్పిన పద్యములే యతని కవిత్వమును వర్ణించునవిన నతిశయోక్తి కాఁజాలదు.

క. చెప్పవలెఁ గప్పురంబులు
కుప్పలుగాఁ బోసినట్లు, కుంకుమ పైపై
గుప్పినక్రియ, విరిపొట్లము
విప్పినగతి ఘుమ్మనంగ గవిత్వము సభలన్.

క. చెవులకుఁ జవులై, చల్లఁగఁ
గవులకుఁ దవులై సమస్తకావ్యకళాబం
ధువులై రససింధువులై
యవురా! యనఁ గవిత లవని నలరఁగవలదా. (1—25,16)

మూఁడవదగు ధర్మజ్ఞచరిత్ర మొకసంకలితగ్రంథము. ఆంధ్రవిజ్ఞానసమితి కధ్యక్షులగు శ్రీ వేపకొమ్మ గురువేంకటసుబ్బయ్యగారును, వారిసతీమణి ఆదిలక్ష్మమ్మగారును నాయా గ్రంథములఁగల భక్తిరసపూరితములగు పద్యరత్నముల నేర్చి, వానిని స్కాందపురాణాంతర్గతమగు ధర్మజ్ఞచరిత్రమను కథాసూత్రమునఁ గూర్చి యీ గ్రంథమును రచించియున్నారు. వీరు విజ్ఞానసమితికిఁ బ్రోత్సాహకులగుటయేగాక భాషాభిమానముతో విశేషమగు వ్యయమును భరించి గ్రంథములఁ బ్రకటించుచున్నారు; వీరి కాంధ్రులు తమకృతజ్ఞతను దెలుపవలసియున్నది. పూర్వ

కవివిరచితగ్రంథములను దమగ్రంథమాలయందుఁ బ్రకటించుటతోఁ గాక వీరు స్వయముగఁ గృషిసల్పి యమూల్యములగు పద్యముల సేకరించి, ధర్మజ్ఞచరిత మనుపేర నీప్రబంధమును బ్రకటించియున్నారు. ఇందు వర్ణాశ్రమధర్మములు, శివయోగపద్ధతి, పంచాక్షరీమంత్రమహిమ మొదలగునవి వర్ణింపఁబడినవి.

4 (శ్రీ) వేంకటాద్రీయము—తిరువూరు వెంకటాద్రిగారిచే రచింపఁబడినవైద్యనిఘంటువు ప్రథమసంపుటము. వెల రు 8—0—0.

ఈగ్రంథము వైద్యుల కుపయుక్తమగునటుల చరకసుశ్రుతాది గ్రంథములఁ బరిశీలించి, ఓషధులయొక్క లక్షణములు, గుణములు, పర్యాయపదములు, ఆంగ్ల సంస్కృతాంధ్ర ద్రవిడ, కర్ణాటాది పదములు, వివరణముతోడను, మూల శ్లోకములతోడను సమకూర్పఁబడినవి సులభమగు భాషలో నాంధ్రవివరణము వ్రాయఁబడినది. పెక్కు గ్రంథములఁ బరిశోధించి సంపూర్ణముగ నుండుటకై గ్రంథకర్త లిద్దానిని రచించిరి. ఇయ్యది నిఘంటువని పేర్కొనఁబడినను యాయావస్తువుల గుణదోషముల విచారణ మొనర్చునప్పుడు వైద్యవిషయములను గూడఁ దెలుపుచున్నది. ఇది నిఘంటువునఁ బ్రథమభాగము. ఇందు ఉద్భిజ్జ వర్గము మాత్రము కలదు. కేవలము వైద్యమునకేగాక యాంధ్రభాషకుఁగూడ నిట్టి నిఘంటువులు మిక్కిలి యుపయోగకరములు. ప్రాచీనగ్రంథములఁ గల పెక్కుపదముల యర్థము నిట్టి గ్రంథముల సహాయమున మనము గ్రహించుటకు వీలగుచున్నది. గ్రంథకర్తలు త్వరలో మిగిలిన భాగములను గూడ ముద్రింతురు గాక. వలయువారు నూజివీడు గ్రామవాస్తవ్యులగు గ్రంథకర్తలకు వ్రాయవలయును.

చాళుక్యభీముఁడు ప్రథమాంధ్ర కవి కాఁడు.

బండారు తమ్మయ్య.

ఆంధ్ర వాఙ్మయమున నింతవఱకు నుపలబ్ధమయిన గ్రంథసామగ్రిని బట్టి నన్నయభట్టారకుఁడు ప్రథమాంధ్రకవియనియు నాతని యాంధ్ర మహాభారతమే తొలి కావ్యమనియుఁ బలువురుపండితుల యభిప్రాయమ యియున్నది. ఇందు కనుగుణముగనే, నన్నెచోడుని కుమారసంభవము వెలువడినతరువాతఁగూడ నాతనికావ్యము నన్నయభారతమున కిటీవలిదే యని తమకుఁ దోఁచిన యుపపత్తులతో నిరూపించు పండితు లాగ్రంథ మందలి,

క. మునుమార్గకవిత లోకం
   బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
   గున నిలిపి రంధ్రవిషయం
   బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్.

అనుపద్యమున నుదాహృతుఁడయిన చాళుక్యరాజు నన్నయభారతము నకుఁ గృతిపతియగు రాజరాజనరేంద్రుఁడే యని తలంచుచున్నారు. ప్రత్యక్షప్రమాణముగఁ గానవచ్చు నన్నయభారతమును బట్టియు నాంధ్ర వాఙ్మయమునఁ జిరకాలమునుండి వచ్చుచున్న వాడుకనుబట్టియుఁ బయి యభిప్రాయము సమంజసమనియే యెంచఁదగును; గాని దానిని ద్రోసి పుచ్చుటకుఁ దగిన యాధారములు లేవు.

శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణా రెడ్డిగారు 'ఆంధ్రభూమి' లోను విభూతిపత్త్రిక (సం 1 సం 2) లోను బ్రకటించిన "నన్నిచోడ నన్నయభట్ట కవులు సమకాలికులే" అను వ్యాసమున, సంస్కృతకవిస్తుతుల వెనుక రచించిన "మునుమార్గకవిత" యనుపద్యముతోసువాత నన్నెచోడుఁడు తన కుమారసంభవములో

చ. సురవరులం గ్రమంబుగ వ, చోమణిసంహతిఁ బూజచేసి, మ
  ద్గురుచరణారవిందముల, కుం దగసమ్మతిఁ జేసిమ్రొక్కి, వి
  స్తరమతులం బురాణకవి, సంఘము నుత్తమమార్గసత్కవీ
  శ్వరులను దేశిసత్కవుల, సంస్తుతిచేసి మనోముదంబునన్.

అనుపద్యము వ్రాసియుండుటచే నీపద్యమునందలిక్రమమునుబట్టి పూర్వ పద్యోదాహృతులగు "చాళుక్యరాజు మొదలగుపలువురు" దేశికవీశ్వరుల నియే గణింపఁ దగునుగాని, రాజరాజువంటి దేశికవితాపోషకులని తలం పరాదనియు నందుచే నన్నయభారతము తరువాతనే నన్నెచోడుని కుమా రసంభవము రచింపఁబడినదని విమర్శకులు పలువురు నిర్ణయించుటసాహ సమని చెప్పవలసివచ్చినందుకుఁ జింతిల్లుచున్నామనియుఁ దమయభిప్రా యమును దెలియఁబఱిచిరి; కాని యావ్యాసమునందు దేశికవితను సృజిం చిన యాచాళుక్యరాజెవరో శ్రీరెడ్డిగారు పేర్కొనలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక (సం 28 సం 1)లో నేఁ బ్రకటించిన "నన్నెచోడునికాలము" అనువ్యాసములో "పుట్టించు" అనుప్రేరణక్రియకు "సృజించు - లేక రచించు" అని యర్థము చెప్పుట సమంజసము కాదనియు, నన్నెచోడుని పద్యమునుబట్టి రాజరాజువంటి చాళుక్యనృపాలురు నన్నయభట్టువంటి దేశికవులచే నారంభింపఁజేసిన దేశికవితారచనమే ద్యోతకమగుననియు, నన్నెచోడుఁడు పయిరెండుపద్యములకు నడుమ దేశికవులస్తుతించినకొన్ని పద్యములు వ్రాసియుండుననియు నవిమనకుదొరకిన యాతని కుమార సంభవైకప్రతిలో లోపించియుండుననియు, అట్లుకానిచో నన్నెచోడుఁడు "దేశిసత్కవుల సంస్తుతిఁజేసి" యనుటలో సాముదాయిక దృష్టినే కయి కొనియుండుననీ తలంపనగుననియు వ్రాసియుంటిని. మఱియు నావ్యాస మునందు, శ్రీరెడ్డిగారు తమవ్యాసమున సపూర్వమగు చిత్రప్రదర్శన మొనర్చుచు నన్నెచోడుఁడు కుమారసంభవమును విక్రమశకగతవర్షము 1110 అగు జయసంవత్సర చైత్రశుద్ధ తృతీయామంగళవారము (క్రీ. శ. 15-3-1054) నాఁటికి ముగించియుండుననీ తిథివారసహితముగ నిర్ణయిం

చిన కింతసిద్ధాంతమునందలి వైపరీత్యమును గూడ వెల్లడించియుంటిని దీనిపై శ్రీరెడ్డిగారు దగిన సమాధానముల నింతవఱకుఁ బ్రకటించినట్లు కానరాదు.

ఆంధ్రకవిత్వమును దొలుత నారంభించినదియెవరో యొక చాళుక్యరాజయి యుండునను తమయభిప్రాయబీజమును మొలకలెత్తించుటకుఁ గాఁబోలు శ్రీ వేంకటకృష్ణారెడ్డిగారు ప్రమాథిసంవత్సరము ఉగాదికి నెల్లూరునుండి వెలువడిన "జమీన్‌రైతు" ఉగాదికానుక సంచికలో "చాళుక్యరాజు చాళుక్యభీమకవికాదా?" అనుమతియొక యింతవ్యాసమును బ్రకటించి, అందలి విషయములనే యనువదించి విస్తరించుచు ది 22-10-1939 నాఁడు ప్రకటితమయిన విభూతిపత్రిక (సం 1 సం. 9) లో "చళుక్యభీముఁడే చాళుక్యరాజదేశిసత్కవి" అను వేఱొకవ్యాసమును గూడఁ బ్రకటించియున్నారు. మొదటివ్యాసమున కెత్తుగడగా శ్రీరెడ్డిగారు "ఆంధ్రకవితాపట్టాభిషిక్తుండైన నన్నయభట్టోపాధ్యాయ సార్వభౌమునికంటె ప్రాచీనుఁడైన దాక్షారామచాళుక్యభీమ కవిసార్వభౌముఁడు కలఁడని కాశీఖండకవిసమయచరిత్ర చెప్పుచున్నది." అనువాక్యముల రచించి, రెండవవ్యాసము మొదట "నేనీవ్యాసములో దేశికవితఁ బుట్టించి తెనుంగు నిలిపిన చాళుక్యరాజు "చళుక్యభీమ" దేశిసత్కవియని కాశీఖండాది కావ్యప్రమాణములతో నిరూపింపఁదలఁచినాను." అని లిఖించియున్నారు. ఈచాళుక్యభీముఁడు రమారమి క్రీ శ. 892 మొదలు 922 వఱకు వేంగిరాజ్యమును బరిపాలించిన తూర్పుచాళుక్యరాజు.

నన్నెచోడుఁడు నన్నయభట్టునకుఁ బూర్వుఁడను వారివాదమును, దరువాతివాఁడను వారివాదమునుగూడ నంగీకరింపక యాకవు లిరువురు సమకాలికులను నొకవినూత్నవాదమును బ్రకటించు కుతూహలముతో శ్రీరెడ్డిగారు రచించిన "నన్నిచోడ నన్నియభట్టకవులు సమకాలికులే" అను వ్యాసములోఁ గుమారసంభవరచనాకాలనిర్ణయమునకై వారవలంబించిన చిత్రవిచిత్రవినూత్నపద్ధతిని బరికించినవారికి శ్రీరెడ్డిగారి విమ

ర్శనవిధానమందలి వైలక్షణ్యము గోచరించియే యుండును. అట్టి మార్గమునే ప్రస్తుతవ్యాసరచనమునందుఁ గూడ వా రవలంబించియున్నారు. ప్రథమాంధ్రకవి నన్నయభట్టారకుఁడయినను, శ్రీరెడ్డిగారు తలంచునట్లు చళుక్యభీముఁడయినను పుత్రుఁడయినను, సమగ్రవాక్యములఁగాని వాని వలన వ్యక్తమగు సమన్వయార్థములఁగాని కయికొనక, ఎచ్చటెచ్చటనో యున్న యందదుకు పదములను, వ్యస్తవాక్యములను గ్రహించి యిచ్చ వచ్చినట్లు వానికి సంబంధమును ముడివెట్టి, విచ్చలవిడిగఁ గావలసిన యర్థములఁజెప్పి వింతసిద్ధాంతము లొనర్చు వినూత్నవిచిత్రవిమర్శనవిధానమునకు శ్రీవేంకటకృష్ణారెడ్డిగారిని ప్రప్రథమాచార్యులుగ నెన్నఁదగు నని నాయభిప్రాయము.

ఇఁక రెడ్డిగారు చళుక్యభీమరాజును ప్రథమాంధ్రకవిగా గణించుటకయి గ్రహించిన వింతమార్గమును దిలకింపుఁడు.

కాశీఖండకృతిపతియగు వీరభద్రారెడ్డి యన్న వేమారెడ్డి శ్రీనాథునిఁ బ్రశంసించుచుఁ బలికినట్లు లాగ్రంథావతారికలోఁ జెప్పఁబడిన,

"శా. ఈక్షోణిన్ నినుఁబోలు సత్కవులు లే(వే)రీ నాఁటికాలంబునన్
దాక్షారామ చళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయగంధసారఘుసృణద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించన్ గళాసార్వభౌమ భవదీయప్రౌఢసాహిత్యముల్."

అనుపద్యమునందలి "నినుబోలు సత్కవులు లేరు" అను సిద్ధాంతవాక్యము శృంగారశ్రీనాథునితో సరితూఁగఁజాలిన శృంగార చళుక్యభీమ సత్కవి కలఁడని వ్యంగ్యముగాఁ జెప్పక చెప్పుచున్నదఁట. ఇట్టి యపూర్వవ్యంగ్యత యీపద్యమునందు నేఁటికి శ్రీరెడ్డిగారికి వినూత్నముగా స్ఫురించినదిగాని యింతవఱ కెవరికిని గోచరించినది కాదు. పయి పద్యము రెండవపాదము నందలి "చళుక్యభీమ" అనుపదైకదేశమును మాత్రము గ్రహించి శ్రీరెడ్డిగా రీవినూత్నసిద్ధాంతమున కుపక్రమించుచున్నారు. ఇందు చళుక్యభీమవర అనుటకు చళుక్యభీమపుర అనుపాఠము

కూడఁగలదు. దక్షారామము, చళుక్యభీమవరము (పురము) వేమ వీర భద్రారెడ్ల పాలనమునందలి రెండుపుణ్యక్షేత్రములు. ఇవి పంచారామములలోఁ జేరినవి. ఈరెండు తావులందునుగూడ భీమేశ్వరనామాంకితములగు శివలింగములు వెలసియున్నవి. పంచారామములలోని కుమారారామమే చళుక్యభీమవరము. ఇది దక్షారామమున కిరువదిమైళ్ళ దూరమున సామర్లకోటదగ్గఱ నిప్పటికిని భీమవరమను పేరితోనే పిలువఁబడుచున్నది. ఇది శ్రీరెడ్డిగారుకూడ నెఱుంగకపోలేరు. చళుక్యభీమవరమనియు, చాళుక్యవంశరాజధానియగు చాళుక్యభీమవరము" అనియు గ్రామనామములనుగూడఁ దమవ్యాసములలో వారుదాహరించినారు. కాని యిక్కడమాత్రము "వర" శబ్దమును విడఁదీసి గంధర్వాప్సరోభామినులకు విశేషణముగా గ్రహింతురుకాఁబోలు. "పుర" శబ్దపాఠమును వీరసలే గ్రహించినట్లు తోఁచదు. ఇప్పుడు ద్రాక్షారామ మని పిలువఁబడు దక్షారామునందును, కుమారారామ మని వ్యవహరింపఁబడు చళుక్యభీమవరమునందును బూర్వము స్వామికైంకర్యమునకయి నాట్యగాంధర్వ విద్యాపారీణలగు వేశ్యామణులు పెక్కురుండెడివారు. శ్రీనాథుని భీమఖండము చదివినవారికది తెల్లమగును. వలయునపుడీ వేశ్యామణులు వేమవీరభద్రారెడ్ల కొలువుకూటమునకేఁతెంచి తమవిద్యానైపుణ్యమును బ్రదర్శించెడివారు, కాశీఖండమునందలి.

సీ. త్రైలోక్యవిజయాభిధంబైన సౌధంబు
  చంద్రశాలా ప్రదేశంబునందు
సచివసైన్యాధీశ సామంతనృపవార
  సీమంతినీ జనశ్రేణి గొలువ
శాస్త్రమీమాంసయు సాహిత్యగోష్ఠియు
  విద్వత్కవీంద్రులు విస్తరింపఁ
గర్పూరకస్తూరికా సంకుమదగంధ
  సారసౌరభము దిక్పూరితముగ

గీ. నిజభుజావిక్రమంబున నిఖిలదిశలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరుని యంక మాశ్రయించి
నిండుకొలువుండెఁ గన్నుల పండువుగను.

అను పద్యమువలన నిది ద్యోతితమగును. త్రైలోక్యవిజయాభిధానసౌధమున నిండుకొలువు పైని వర్ణించినరీతిని సాగుచున్నసమయముననే రెడ్డి వేమవిభుఁడు శ్రీనాథునిఁగూర్చి "ఈక్షోణిన్ నినుబోలుసత్కవులు లేరు" అను పద్యమును బలికినది. దీనిలోని "ద్వైవరాజ్యభారంబు" అను దానియర్థ మేమయి యుండునని పలువురు సందేహములఁ బ్రకటించిరి. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు తామురచించిన శ్రీనాథకవిచరిత్రములో నిందుఁగూర్చి కొంత చర్చించి ద్వైవరాజ్యశబ్దమునకు సరియగునర్థమును జెప్పకపోయినను బద్యము చెప్పఁబడిన సమయసందర్భములఁబట్టి "ఈకొలువుకూటమున నృత్యమొనర్చు దాక్షారామచళుక్యభీమవరక్షేత్రములందలి వేశ్యామణులు తమవక్షోజద్వయముపయి యలందిన చందనకుంకుమముల పరిమళములు సభాంతరాళముల గుబాళించునట్లే నీ ప్రౌఢసాహిత్యసౌరభములుకూడ వాసికంటె నెక్కుడుగ నెల్లయెడల వ్యాపింపనేర్చును" అని పద్యముయొక్క భావార్థమయి యుండునని వ్రాసియున్నారు. ఇందుపయి 1933 సంవత్సరమున రాజమహేంద్రవరమున జరిగిన యాంధ్రసాహిత్య పరిషద్వార్షికోత్సవసభలో నేను "శ్రీనాథకవిప్రయోగములు" అను వ్యాసమును జదువుచు దానిలోఁ బయిపద్యమునుగూర్చికూడ ముచ్చటించుచు శ్రీ వీరభద్రరావుగారు చెప్పిన యర్థముకంటె విశాలమగు మఱియొకయర్థము నాకును నామిత్రులు శ్రీ ఇవటూరి సుందరయ్యగారికిని స్ఫురించినదనియు ద్వైవరాజ్యభారంబు" అనుటకంటె "ద్వైవరాజ్య పారంబు" అనునది శ్రీనాథుని పాఠమయియుండునని తలంచుట సమంజసమనియుఁ జెప్పి యీక్రింది యర్థమును వివరించితిని. గంధసారఘుసృణములు, అనఁగా మలయజకా

శ్మీరములు (చందనకుంకుమములు) వరుసగా రెండు వేర్వేఱు దేశముల కుఁ (రాజ్యములకు) జెందినవి. గంధసారమునకు నిలయమగు మలయ పర్వతమున్న పాండ్యరాజ్యము మొకటిది. కుంకుమమునకు జన్మస్థాన మగు కాశ్మీరము రెండవది. పారమనఁగా నవతలియొడ్డు. మలయపర్వత మున్న రాజ్యభాగమున కవతలనే సముద్రమున్నది. కాశ్మీరరాజ్యమున కవతలనే హిమాలయపర్వతములున్నవి. "శ్రీనాథకవిసార్వభౌమా ? ఈ భారతక్షోణిలో నీవంటి సత్కవు లీనాఁటికాలమున లేరు. దాక్షారామ చళుక్యభీమపుర వేశ్యామణుల వక్షోజములందలి చందనకుంకుమ సౌర భములు వారినృత్యవేళలయందు సభాంతరాళములనిండి గుబాళించునట్లు నీ కవిత్వసౌరభములు వానినతిక్రమించి యాచందనకుంకుమముల జన్మ స్థానములగు పాండ్య కాశ్మీర రాజ్యముల దాఁటి యాసేతుహిమాచల పర్యంతము వ్యాపింపఁజాలును"

శ్రీనాథకవి ప్రయోగము" లను నాపూర్వోక్తవ్యాస మటు తరువాతఁ బరిమళపత్త్రిక (సం 24 సం 4) లోఁ గూడఁ బ్రకటింపఁబడినది. సభలో విన్న పండితులుగాని పత్త్రికలోఁజదివిన పాఠకులుగాని ఈయ ర్థము సరికాదను ప్రతివాదము నెవరు నింతవఱకుఁ బ్రకటింపలేదు. ప్రకరణసందర్భములఁబట్టి పర్యాలోచింప నీపద్యమున కిట్టియర్థమే సమం జసముగ నుండునుగాని యిందులోఁ జళుక్యభీముఁడను నొక పూర్వకవి ప్రశంస వ్యంగ్యముగఁగాని వాచ్యముగఁగాని యున్నదని తలఁచుట కిట్టి యవకాశమును లేదనియే నాయభిప్రాయము. శ్రీ వేంకటకృష్ణారెడ్డి గారి కిట్టిసహజస్వాభావికార్థములతోఁ బ్రసక్తి లేకుండుట శోచనీయము. "చళుక్యభీమ" అనుపదము వెనువెంటనేయున్న "వర (పుర)" శబ్దముల మాట యేమి ? వానితోడి సమన్వయ మెట్లు? అను విచారమే వారికి లేదయ్యెను. "చళుక్యభీమ'' అనుపదము దొరకినదిగదా చాలును. దా నినిఁబట్టి ప్రాఁతలాడి మఱికొన్ని కారణాభాసములతో సంబంధమును ముడి వెట్టి యాకాశహర్మ్యముంబోలు నపూర్వసిద్ధాంతమును బ్రకటింపవచ్చు

సని వారు ముచ్చటపడిరి. ఈయభిప్రాయసమర్థనమునకయి వారు ప్రదర్శించిన పరికరపటుత్వమునుగూడ నిక విలోకింతము.

శ్రీనాథుఁడు కాశీఖండమునకు ముందు రచించిన భీమఖండము లో సత్కావ్యలక్షణమునుగూర్చి చెప్పిన,

మ. హరచూడాహరిణాంకవక్రతయుఁ గా ౕ లాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢపయోధర స్ఫుటతటీ ౕ పర్యంతకాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా ౕ సత్కావ్యముల్ దిక్కులన్
జిరకాలంబు నటించుచుండుఁ గవిరాాజీగేహరంగంబులన్.

అనుపద్యము "ప్రౌఢసాహిత్యములతోఁదులతూఁగిన ద్వైరాజ్యభారంబు సాహిత్యద్వైరాజ్యభారంబు"అనివాచ్యముగాఁ జెప్పుచున్నదఁట. శ్రీరెడ్డిగారీవాక్యమున నుద్దేశించిన భావమేమియో నాకు స్పష్టముగ బోధపడలేదు. సాహిత్యములతోఁ దులతూఁగిన ద్వైరాజ్యభారంబు సాహిత్యద్వైరాజ్యభారంబని యూరక పదములను దిరుగవైచినంతమాత్రమునఁ బ్రయోజన మేమి? వక్రత, ధ్వని, వ్యంగ్యము ననునవి యాలంకారికమతములో నించుమించుగ సమానలక్షణార్థకములు. పయిపద్యములో శ్రీనాథుఁడు పేర్కొనిన "వక్రత" ధ్వనివ్యంగ్యములకు బోధకమనియు, చండికావక్షోజకాఠిన్యము గాఢసమాస బంధమునకు ద్యోతకమనియు, ఈరెంటిని గలిగి పయిఁగా నన్నిటికంటె ముఖ్యమగు సరసత్వమును గలిగిన సత్కావ్యములు చిరస్థాయులై వెలయఁగలవనియుఁ జెప్పుటయే పయిపద్యమున శ్రీనాథుఁ డుద్దేశించిన భావమని నేఁ దలంతును. ఈలక్షణము లాతని కృతులయందు నిండారియుండుట పండితుల కెల్ల ననుభవమే. "భీమఖండమునఁ జెప్పిన స్పష్టార్థమునే కాశీఖండములో శ్రీనాథుఁడు వ్యంగ్యముగా వివరించెననియు, పయోధరస్ఫుటతటీపర్యంతకాఠిన్యమును, సరసత్వంబును గలిగిన కావ్యములను వక్షోజద్వయగంధసారఘుస్రుణద్వైరాజ్యభారంబు అనే ప్రౌఢసాహిత్యవ్యంగ్యముగఁ (వాచ్యముగా) జెప్పినాఁడనియు, కాశీఖండమందలి గంధసార (చందనము)

ఘుసృణము (కుంకుమపువ్వులు) భీమఖండమందలి సరసత్వచిహ్నములే కాని మైపూఁతలు కావనియు, "నాళీకభవవధూస్తన పాళీకహ్లార రమ్యపరిమళలహరీ శాలీనతా విభాయువ। చోళీలలు తల్లనార్థి సురభికి నమరున్" అను భీమఖండపద్యమున శ్రీనాథుఁడు స్తనరమ్యపరిమళలహరీ (తెమ్మెరలు) వచోళీలలు, అని నిరూపించియున్నాఁడని యుపోద్ఘాతము కొంత చెప్పి, రెడ్డిగారు "దాక్షారామచళుక్యభీమ-ద్వైరాజ్యభారంబు" "చళుక్యభీముని (సంస్కృతాంధ్ర) వచోళీలలు (ప్రౌఢసాహిత్యములు) అని నిర్ణయింపవచ్చునని యు, పయి రెండుపద్యములలో శబ్దభేదమే కాని భావభేదము లేదని స్పష్టమగుచున్నదనియు సెలవిచ్చిరి. కవితాబంధమును యువతీవక్షోజాతకాఠిన్యముతోను, సరసకవిత్వసౌరభములను సుగంధపరిమళములతోడను సరిపోల్చుట కవులందఱకు సర్వసామాన్యమే. ఈవిషయమున శ్రీనాథుఁడు క్రొత్తగఁ జెప్పిన దేదియులేదు కవితాలక్షణవిషయమున రెడ్డిగారు పేర్కొనిన భీమఖండ కాశీఖండపద్యములందలి స్పష్టార్థవ్యంగ్యార్థము లెట్టివయినను వానివలనఁ జళుక్యభీముఁడను కవియొక్క ప్రౌఢసాహిత్యప్రసక్తి కేమాత్రమయిన సంబంధ మున్నదేమో సహృదయులు నిర్ణయింతురుగాక.

ఇఁక శ్రీనాథుని దని పలుపురు తలంచు

శా. అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ ! కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
దక్షారామచళుక్య భీమవరగంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

అను చాటువునుగూడఁ బేర్కొని యది "ఈక్షోణిన్ నినుబోల సత్కవులు -" అను కాశీఖండపద్యమాతృకనుండి పుట్టినదని సెలవిచ్చి యా పద్యముకూడఁ దమయూహకే తోడగునని తలంచి యీ రెం[డు] పద్యములకుఁ బాఠకుల సౌకర్యార్థమని తమ విపరీతపద్ధతిప్రకార మి[ట్టి] దండాన్వయము వివరించినారు.

("అక్షయ్యంబుగ" అను పద్యమునకు)

"ఓ సాంపరాయుని తెలుంగాధీశ ! దాక్షారామ చళుక్యభీమ (వరగంధర్వాప్సరో భామినీవక్షోజద్వయ కుంభికుంభములపయి వాసించుచున్న - ప్రసిద్ధికెక్కిన కావ్యసమయము భీమఖండములో కలదుగద) తద్వాసనలు (ఆసత్కావ్యవాసనలు) కలిగిన సుకవిరాడ్బృందారకశ్రేణికిన్ (ఆశ్రేణిలో చేరినాకు) కస్తూరికాభిక్షాదానము అక్షయ్యంబుగ చేయుమురా; అని శ్రీనాథుడు సభాపూజ్యముగ తెలుంగాధీశుని ప్రార్థించినాడు"

("ఈక్షోణిన్" అను పద్యమునకు)

"ఓ శ్రీనాథకవిసార్వభౌమ ! భవదీయప్రౌఢసాహిత్యములు దాక్షారామ చళుక్యభీమ (వరగంధర్వాప్సరో భామినీవక్షోజ ద్వయగంధసారఘుసృణము లు - కాఠిన్యమున్ సరసత్వంబును సంభవించె ననగా సత్కావ్యముల్)......సాహిత్యద్వైరాజ్యభారంబున్ అధ్యక్షించున్ (ప్రౌఢోక్తి) కనుక ఈక్షోణిన్, ఈ నేటికాలంబునన్ నినుబోలు సత్కవులు లేరు" అని రెడ్డి వేమవిభుడు సభాపూజ్యముగా ప్రశంసించినాడు"

చీకటిలోని చిందులాటవలె నీయన్వయము లెంత గందరగోళము గానున్నవో వేఱ చెప్పనక్కఱలేదు. సందర్భశుద్ధి వీనియం దెంతవఱకున్నదో నిర్ణయింప సహృదయులే ప్రమాణము.

మఱి యింకను వింతలో వింత కాశీఖండావతారికలోని "ఈక్షోణిన్......" అను పూర్వోక్తపద్యమునకు మునుముందేయున్న 'వచియింతు వేములవాడ భీమనభంగి నుద్దండలీల నొక్కొక్కమాటు...'' "అను సీసపద్యములో శ్రీనాథుడు ప్రప్రథమమున కవిత్రయము కంటెముందు వేములవాడ భీమకవిని పేర్కొనుటచేతను, కస్తూరి రంగకవి తనయానంద రంగరాట్ఛందములో "ఆదిమసుకవి భీమనకు దండము పెట్టి నన్నయభట్టునకు నర్థిమ్రొక్కి" అని వ్రాసియుండుటచేతను, శ్రీ రెడ్డిగారు ఆదికవియని తాముతలంచు చళుక్యభీముడే యీ వేములవాడ

భీమన నొకసారి స్మరించియుఁ గవిస్తుతిలో నాతనికి నమస్కరింపకుండుట యాతఁడు బ్రాహ్మణుఁడు కాకపోవుటచేతనఁట. మఱియు రెడ్డివేమవిభుని ప్రశంసామూలమునఁ దాను చాళుక్యభీమునకంటె గొప్పకవి నగుదునని మురిసి యుబ్బిపోయి యా యభిమానముచేఁగూడ నాతనికి నమస్కరింపఁ డయ్యెనఁట. చాళుక్యభీముఁడు శ్రీనాథునకంటె సుమారు 500 సంవత్సరముల ముందున్నవాఁడు. అట్టిచో నాతఁడొక గొప్ప పూర్వకవి యను తలంపే యాతనికున్నచో వేమారెడ్డి ప్రశంసమాత్రమునఁ దానాతనికంటె గొప్పవాఁ డగుదునని గర్వించి యాతని కభివందనమొనర్పుట మానునా. అట్లే యైనచోఁ దగుదునని మరల నాతనిని సామ్యమునకుఁ దెచ్చికొని యాతనివలె నుద్దండలీల వచింపనేర్తునని చెప్పికొనుట యెందుకు? కుఱుఁగా నీ కవిస్తుతులలో బ్రాహ్మణాబ్రాహ్మణ సమస్య కూడ శ్రీనాథున కంటఁగట్టుటయా? పాపమివియన్నియు శ్రీరెడ్డిగారు తెచ్చిపెట్టినవేగాని శ్రీనాథునకీ గొడవలేమియు లేనేలేవు. ఆతనిదృష్టిలో నసలు చాళుక్యభీముఁడను నొక కవి లేనేలేఁడు. ఆతని పూర్వులెవరు పేర్కొని స్మరింపని యొక యపూర్వకవి నాతఁ డెట్లు భావింపనేర్చును? ఆతఁడు వాస్తవముగా విన్నది వేములవాడ భీమకవినిగుఱించియే. ఆతనిఁ గూర్చిన యైతిహ్యములు, ఆతఁడు రచించిన చాటువులు గ్రంథములు కొన్ని శ్రీనాథుని కాలమునకు వ్యాప్తియం దుండియుండును. వాడుక కథలఁబట్టి యా భీమకవి కూడ బ్రాహ్మణుఁడేగాని యితరకులజుఁడుకాఁడు. దక్షారామ భీమేశ్వరుని యనుగ్రహమువలన నొక బ్రాహ్మణవితంతువునకు నందనుఁడయి యుదయించినవాఁడు. కావుననే

"ఘనుఁడన్ వేములవాఁడ వంశజుఁడ, దక్షారామభీమేశ నం
దనుఁడన్, దివ్య విషామృతప్రకట నానాకావ్యధుర్యుండ, భీ
మన నాపేరు వినంగఁజెప్పితిఁ దెలుంగాధీశ! కస్తూరికా
ఘనసారాది సుగంధవస్తువులు వేగం దెచ్చి లాలింపురా."

అను చాటుపద్యములో దక్షారామ భీమేశనందనత్వమును పేర్కొని

యున్నాఁడు. ఐతిహ్యములఁబట్టి చాటువులఁబట్టి యాతఁడు నన్నయభట్టు నకు సమకాలికుఁడో యించుక యటీవలివాఁడో కాఁదగును.

"వచియింతు వేములవాడ భీమసభంగి..." అనుపద్యములో శ్రీనాథుఁడు కేవలము కాలపౌర్వాపర్యమును చాటించినట్లు తలంప నవకాశము లేదు. శ్రీ రెడ్డిగారు చెప్పినట్లు "అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ..." అనుచాటుపద్యము "ఈక్షోణిఁ గనుబోలు..." అను కాశీఖండపద్యమునుండి యేర్పడినదనుటకంటె నాచాటుపద్యమునందలి "దక్షారామ చళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ వక్షోజద్వయ" అను భాగమే కాశీఖండపద్యమున శ్రీనాథుఁడు గైకొనెననుట సత్యమునకు సమీపముగ నుండునని నాయభిప్రాయము. కస్తూరికాఘనసారాది సుగంధవస్తువులకయి వేములవాడభీమకవి యొక తెలుంగాధీశునిఁ బైని చెప్పిన "ఘనసందర్శ..."అను పద్యమునం దర్థించియున్నాఁడు. ఆ తెలుంగాధీశుఁడు సాంపరాయని తెలుంగాధీశుఁ డవునో కాదో నిశ్చయముగఁ జెప్పఁజాలము కాని సాంపరాయని తెలుంగాధీశయని "అక్షయ్యంబుగ..."అనుపద్యములో మరలఁ గస్తూరికాభిక్షాదానమునకయి సంబోధింపఁబడి యర్థింపఁబడిన వాఁ డాతఁడే యయి యుండఁదగునని నాయభిప్రాయము. భీమకవి జన్మస్థానమగు వేములవాడకు రెండుమూఁడు మైళ్ల దూరమునఁ సాంపరాయనిపురము (ఇప్పుడు సంపరయనీ పిలువఁబడు గ్రామము) ఉన్నది. పూర్వమది యొక రాజుచేఁ బరిపాలింపఁబడి వైభవముతో విలసిల్లిన పట్టణమని తెలియుచున్నది. శ్రీనాథుని భీమఖండములోఁ గూడ నీసాంపరాయనిపురము పేర్కొనఁబడినది. తెలుంగురాయనికి సాంపరాయనిపురమునకుఁగల సంబంధము పరిశోధింపఁ దగినది. భీమకవి తెలుంగురాయని మొదట దర్శించినపుడు నిజనామప్రకటనాదికము గావించికొని, కృతపరిచయుఁడయిన యాతనిని మరల సందర్శించినపుడు "సాంపరాయని" విశేషణముతో నాతనిఁ బేర్కొనియుండును. భీమకవి యుద్దండశైలియందలి గౌరవముచేతనే శ్రీనాథుఁడాతనిని

గాశీఖండావతారికలో "వచియింతు వేములవాడ భీమనభంగి..." అను పద్యములో స్మరించి యాపద్యము వెనువెంటనే యాయుద్దండశైల్యాను కరణసూచకముగ "క్ష" ప్రాసతోనే "ఈక్షోణిక..." అనుపద్యమును వ్రాసి భీమకవియందలి గౌరవము చేఁ బూర్వోక్తపద్యభాగమును మార్పు లేకుండ నందు గ్రహించినాఁడని నాతలంపు. ఈవిషయముల నిదివఱలో నా "శృంగార శ్రీనాథవిమర్శనము"నందును "శ్రీనాథకవిప్రయోగము లు" అను వ్యాసమునందును వివరించియే యుంటిని కావున శ్రీనాథుఁడు వేములవాడ భీమకవిని మాత్రమే పేర్కొనెననియు, అతనికిఁ జాళుక్య భీమరాజునకు నెట్టిసంబంధమును లేదనియు నీయిరువురకు నిఁచుమించుగ రెండువందల సంవత్సరముల యంతర మున్నదనియు, శ్రీనాథుని దృష్టిలోఁ జాళుక్యభీముఁడను కవి లేనేలేఁడనియు బుద్ధిమంతులకు దోఁపకపోదు. ఈసందర్భమున రెడ్డిగారు శ్రీనాథుఁడు ఛందోనిర్బంధమునఁ జాళుక్య భీమనయనుటకు మాఱు వేములవాడ భీమనయని వ్రాసియుండుననుట మఱియు నాశ్చర్యకరము. చెప్పఁదలఁచిన విషయములకు శ్రీనాథకవి సార్వభౌమునకు ఛందస్సడ్డుతగులనేర్చునా! "విరచింతుఁ జాళుక్య, విభుఁ డు భీమనభంగి" అనియో "విరచింతుఁ జాళుక్య. భీమనవిధమున" అని యో వ్రాయనేరఁడయ్యెనా?

కస్తూరిరంగకవి యప్పకవికంటెఁ గూడ నర్వాచీనుఁడు. ఆతఁడు తనఛందోగ్రంథమున నుతించిన భీమకవి కవిజనాశ్రయ మను ఛందో గ్రంథమునకుఁ గర్తయని తలంపఁబడు వేములవాడ భీమకవియే యయి యుండును. అతనికి ఆదికవియను విశేషణమును జేర్చుటలో రంగకవి వాడుకకథలను అప్పకవీయమునఁ జెప్పఁబడిన సంగతుల ననుసరించి యుండును. అప్పకవి నన్నయభట్టు భారతమును నాంధ్రశబ్దచింతామ ణిని గలియుగాదిని రచించినట్లు తనయవతారికలో వ్రాసినాఁడు. భీమ కవివ్రాసిన రాఘవపాండవీయాది గ్రంథములను నన్నయభట్టడంచెనను నైతిహ్యములఁగూడ నాతఁడు గ్రంథస్థమొనరించినాఁడు. ఈలాక్షణిక

గ్రంథకర్తలకుఁ జారిత్రకజ్ఞానము చాలఁ దక్కువ. నన్నయభట్టు క్రీ. శ. 1030 ప్రాంతీయమువాఁడని శాసనాద్యాధారములచే వ్యక్తమగుచుండ నాతఁడు కలిఁ యుగాదిపురుషుఁడను నప్పకవి వ్రాఁతకేమి ప్రామాణ్య ముండును? ఇట్టి యూతని ననుసరించిన కస్తూరిరంగకవి భీమనకవికిఁ జేర్చిన యాదికవి విశేషణమునకుఁ బ్రామాణ్యము చరిత్రజ్ఞుల దృష్టిలో సిద్ధింపనేరదు. ఇంతకు నాతఁడు పేర్కొనిన భీమకవి మన రెడ్డిగారు తలంచినట్లు చాళుక్యభీమరాజుకుఁ గట్టి యాధారమును లేదుగదా!

వేములవాడభీమకవి గోదావరిమండలమువాఁడనియు నాతని జన్మస్థానము దక్షారామ సమీపమందలి వేములవాడయనియు వాడుకవలన యిదియుఁ దెలియుచున్నది. ఇందుకు వ్యతిరేకముగ నాతఁడు నిజామురాష్ట్రమందలి వెలిగందలకు సమీపమందున్న వేములవాడ వాస్తవ్యుఁడను వాదమొకటి కొంతకాలమునుండి బయలుదేఱినది. ఇందుఁ గూర్చి శ్రీ జయంతి రామయ్యపంతులుగారు కవిజనాశ్రయ పీఠికలోఁ గొంత చర్చించి యా వాదముపట్లనే ప్రవృత్తిఁజూపియున్నారు. కవిజనాశ్రయకృతిపతి రేచన నిజామురాష్ట్రము ప్రాంతమువాఁడుగ గోచరించును. ఆ ప్రాంతమందలి వేములవాడలో నొకభీమకవి యుండినచో నాతఁడే కవిజనాశ్రయకర్తయై యుండుననువాదమునకుఁ గొంత సంకేతముగానేయుండును. ఆసందర్భములో వేములవాడ భీమకవియు వేములవాడ భీమకవియు నొక్కఁడే యనుటకంటె నిరువురు వేర్వేఱు పురుషులని తలంచుటయే సమంజసమని నాయభిప్రాయము. చాటుపద్యములలో నుదాహృతుఁడయిన వేములవాడ భీమకవి గోదావరీమండలములోని వేములవాడ వాస్తవ్యుఁడనియే చిరకాలమునుండి గొప్పవాడుకగానున్నది. ఆతని చాటువులలో నుదాహృతులయిన కళింగగంగు మున్నగు రాజులుకూడ గోదావరీమండలమునకు సమీపమందున్న మండలములలో రాజ్యపాలన మొనరించినవారు. నిజాముమండలమందలి వేములవాడ భీమకవికి సందర్భమంత సంగతముగానుండదు. ఆవిషయమెట్లున్నను శ్రీ వేంకటకృష్ణారెడ్డిగారీయుర

పురుభీములు నొక్కఁడేయనియు నాతఁడే చాళుక్యభీముఁడనియుఁగూడ నీక్రిందివిధమున విచిత్రముగ వ్రాసినారు.

"ఇఁకఁ గాశీఖండమందలి 'వేములవాడ భీమనభంగి'కి "వేమల వాడభీమనభంగి" అనేపాఠముండవచ్చునా? అనేసమస్యను విచారింతేము. దాక్షారామ, చళుక్యభీమవర, గంధర్వాప్సరోభామిని అనే వేమల వాడలలో దాక్షారామ చళుక్యభీమన అనేచాళుక్యభీమకవికలఁడు. దీనిని గోపరాజకవి గుర్తించి తన సింహాసనద్వాత్రింశికలోఁ గ్రింది చమత్కార చరిత్రను కల్పించినాఁడు."

క. "లేములవాడక శుచిదై
లేములవాడం జరించు లేమలవాడం
దా మెఱసిన భీముని నుత
భీముని బలభీము విమతభీమునిఁ దలఁతుఁ."

"ఈపద్యమందలి బలభీముఁడు రాజైన చాళుక్యభీముఁడని శబ్ద సారస్యమువల్ల నూహించవచ్చును. వేమలవాడ దా మెఱసిన 'బలభీముఁడు' శుచిదైయుండుట సంభవము. ఇది గ్రామచరిత్రకాదనియు, గోపరాజ కవికల్పిత సాహిత్యగ్రామచరిత్రమనియు తోచుచున్నది. కాన కాశీఖం డములోనున్న "వచియింతు వేమలవాడభీమనభంగి నుద్దండలీల నొక్కొ క్కమాటు" అనేమూలపాఠమే సింహాసనద్వాత్రింశిక యతిస్థానపాఠ ముగానున్నదని చెప్పవచ్చును. (ఇట్లయినప్పటికిని కాశీఖండ పాఠాంతర ములను దాళపత్రగ్రంథములలో పరిశీలింపవలసియున్నది). ఇంతేకు "వేమలవాడభీమన" అనే కాశీఖండమూలపాఠము—శృంగారభీమనకు భాషాంతరీకరణ బిరుదమేగాని, వేములవాడ భీమన వంశనామముకాదని కూడ చెప్పవచ్చును."

కాశీఖండమును ముద్రించినవారెవరు నెప్పుడు "వచియింతు వేములవాడభీమనభంగి" అనుచో "వేమలవాడభీమన" అనుపాఠమును సూచించియైన నుండలేదు. ఈపాఠముకూడ నుండియుండదు సను వాద

మును శ్రీ రెడ్డిగారే నేఁడు తెచ్చిపెట్టుచున్నారు సింహాసనద్వాత్రింశిక రచించిన కొఱవి గోపరాజకవి నిజాముమండలమువాఁడు శ్రీనాథునకుం గొంచెమిటీవల క్రీ॥ శ॥ 1460 ప్రాంతమందున్నవాఁడు.

ఈతని తాతతండ్రులు రేచెర్ల వెలమరాజులయొద్ద మంత్రిత్వము నెఱపినవారు. సింహాసనద్వాత్రింశికను ప్రకటించినది యాంధ్రసాహిత్య పరిషత్తు ఈ గ్రంథమునకుఁ బరిషత్తునకు దొరకిన ప్రతులంత పరిశుద్ధమైనవి కావు సందిగ్ధపాఠములు పలుతావుల నున్నవి. శ్రీరెడ్డిగారు పేర్కొనిన వేములవాడ కసుబియై..." అను పద్యమునందు మొదటి రెండు పాదములకు సరియగు నర్థము కుదురుటలేదు. రెండవ పాదమునందలి "లేములవాడం జరించు "అనుచో వేములవాడ యనికూడఁ గొన్ని ప్రతులలో నున్నట్లు పరిషత్తువారు సూచించియున్నారు. లేములవాడ, వేములవాడ పాఠములెట్లున్నను నిందుఁ బేర్కొనఁబడిన భీమకవి కవిజనాశ్రయకర్తయే యని గోచరించును.

ఉ. భీమనపద్యమన్న గడుఁ బ్రీతివహించుచు మేలుమేలు నా
నేమిది చెప్పినారమన నిక్కము ప్రాసము గూర్చినాఁడవా
నేమిదికాదు దీనివడి కెక్కడి కర్థ మిదెట్టి దీ గణం
బేమని పెట్టినాఁడవని యెగ్గులువట్టుఁ గుబుద్ధి పెద్దలన్"
అను పద్యముకూడ దీనిని సూచించును.

గ్రంథావతారికలోని కవిజనాశ్రయకర్త భీమకవి నిజాముమండలమువాఁడని తలంచుటయే సమంజసముగ నుండునని పైనే వ్రాసియుంటిని. ఈపద్యమునకు ముందు గోపరాజకవి నన్నయభట్టునే స్తుతించినాఁడు చూడుఁడు.

క. ఆభారత పర్వత్రయ
మీభారతవర్ష మెల్ల నెఱుఁగఁ దెనుఁగునన్
శ్రీభారతిగతిఁ జెప్పిన
నాభావుకమునుఁ దలంతు నన్నయభట్టున్

కావున గోపరాజకవికి నన్నయభట్టే కవిజనాశ్రయకర్తయగు భీమకవికంటెఁ బూర్వుఁడను నభిప్రాయమున్నట్లు గోచరించును. ఇంతకుఁ జాళుక్యభీముఁడే కవిజనాశ్రయకర్తయనుట కెట్టియాధారమును లేదు. ఆతని రాజధాని విశాఖపట్టణమండలమందలి యలమంచిలి యైనట్లులాతని శాసనములవలనఁ గాన్పించునని చరిత్రజ్ఞులు వ్రాయుచున్నారు. ఇట్టి చాళుక్యరాజు నిజామురాష్ట్రమందలి వేములవాడలోనుండి కోమటి కేచన కంకితముగా గ్రంథమునురచించుట యసంభవమని వేఱ చెప్పనక్కఱలేదు. రెడ్డిగారుదాహరించిన పద్యమందలి నుతభీమ, బలభీమ, విమతభీమ, యనువిశేషణములును ప్రాసమునకయి తేఁబడినవేగాని మఱియొకటికాదు. ఇతరాధారములు లేనప్పుడు కేవలము "బలభీమ" యను విశేషణమునుబట్టి రాజైన చాళుక్యభీముఁడే యాకవియని యూహింపవచ్చునని రెడ్డిగారు వ్రాయుట సరికాదు.

మఱియు "వేములవాడ భీమన"యనునది శృంగారభీమనకు భాషాంతరీకరణ బిరుదమేకాని వంశనామము కాదని వారు తలంచుటగూడ నసంగతము. నిజామురాష్ట్రమందలి లేములవాడకు వేములవాడయను వ్యవహారముకూడ నుండెననియు, మఱియు నచ్చటి శాసనములలో నాగ్రామమునకు "లేమ్బులవాడ" యనుపాఠము గానవచ్చుచున్నదనియు, 'లేమ్బుల' క్రమముగా లేమల, లేముల, వేముల యయి యుండవచ్చుననియు శ్రీ జయంతి రామయ్యపంతులుగారు పూర్వోక్తమయిన కవిజనాశ్రయ పీఠికలో వ్రాసియున్నారు. ఇంతకు గ్రంథములందును జాటుపద్యములందును నుదాహృతులయిన వేములవాడభీమనయు లేములవాడభీమనయు నొక్కఁడయినను వేర్వేఱు పురుషులయినను నాతఁడు చాళుక్యచక్రవర్తి భీమరాజని తలంచుట సర్వవిధముల నసంగతమని సహృదయులకుఁ దోఁపక పోదు. రెడ్డిగారు చెప్పినట్లు లాతఁడు చాళుక్యభీమరాజేయైనయెడల, కోమటి కేచనకుఁ గృతిచెప్పుట, కస్తూరికాది సుగంధవస్తువులకయి తెలుంగురాయని యాచించుట మున్నగు నికృష్టత్వములకాతని గుఱిచేసి

యాతనికిఁ బదభ్రష్టత తెచ్చినవారమగుదుము. ఇట్టిసందేహములు శ్రీ రెడ్డి గారికిఁగూడఁ గొంతవఱకుఁ గలిగినట్లున్నది. కావుననే విభూతిపత్త్రికలోని వారి రెండవ వ్యాసములో "క్రీ॥ శ॥ 9 శతాబ్దమందు చాళుక్యభీమకవి యాస్థానములో కవిజనాశ్రయము పుట్టెనని చెప్పకూడదా? అని పరిశోధింపుఁడు" అని లోకమును హెచ్చరించియున్నారు. కవిజనాశ్రయ విషయమున నిదివఱకే తగినంత పరిశోధనము జరిగినది. దొరకిన ప్రతులలోఁ గొన్నింటివలన నయిన భీమకవి కృతికర్తయనియు, గోనుటి రేచన కృతిభర్తయనియు విమర్శకులు నిర్ణయించియుండ రెడ్డిగారు హెచ్చరించు నీవృథాపరిశోధనమున కవసరమేమున్నది? ముంజేతికంకణమున కద్దమేల? కవిజనాశ్రయమునకుఁ జళుక్యభీమనకు నెట్టిసంబంధము లేదనుట సత్యసమ్మతమయిన సిద్ధాంతము.

తెలుంగురాయునిఁ గస్తూరికాది సుగంధవస్తువులకై యాచించిన పద్యకర్తృత్వము, చళుక్యభీమునియెడ సమర్థించుటకయి రెడ్డిగారు పద్యమందలి తెలుంగాధీశయను పాఠమును "త్రిలింగాధీశ" యని మార్చి "ఇందలి త్రిలింగాధీశుఁడు స్వామికాని రాజుకాఁడని" వ్రాసిరి. కాని యాస్వామియెవరో తెలుపరయిరి. వా రుద్దేశించినది శిలావిగ్రహరూపమున శ్రీకాకుళక్షేత్రమున వెలసిన యాంధ్రనాయకస్వామి కాదుకదా! అట్లేయయినచోఁ బాపము చళుక్యభీమునకుఁ బదభ్రష్టతకు మాఱు మతిభ్రష్టతను రెడ్డిగారు కలిగించినవారగుదురు. ఎట్టి మతిమంతుఁడయిన నిట్టి సుగంధవస్తువులకయి గుడిలోనుండు శిలావిగ్రహమును యాచించునా? ఇంతకుఁ జాళుక్యరాజ్యమునకుఁ జక్రవర్తియగు నా చళుక్యభీముఁ డీవస్తువులకయి యొరుల యాచింపవలసిన దుస్థితికేల లోనయ్యెను?

మఱియు నీసందర్భమున వేములవాడభీమనతోఁ జాళుక్యభీమన నైక్యమొనర్చుటకయి రెడ్డిగారు వ్రాసిన వింకను గొన్ని వింతవాక్యములు చిత్తగింపుఁడు.

"చాళుక్యభీమకవి గోదావరిజిల్లాకు చెందినవాఁడు. ఇంతేకాక

చళుక్యభీమకవి ముదివేము (ముదివేములవాడ) చాళుక్యవంశజుఁడు. కనుకనే "ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ" అని తన చాటుపద్యమును వ్రాసియున్నాఁడు. విధవాకుమారుఁడైన చాళుక్యరాజ జన్మప్రకార కథనమే తద్వంశజుఁడగు (ముది) వేములవాడ భీమన కంటఁగట్టఁబడినదని కూడ శాసనచరిత్రాధారముతో సమన్వయము కుదురుచున్నది. అనఁగా దాక్షారామమునకు పూర్వమా ప్రదేశములో "ముదివేములవాడ" గ్రామముండెనేదా? అని పరిశీలింపుఁడు. ఈ 'ముదివేము' తియ్యగా పండి ద్రాక్షారామమైనదా? పిదప దాక్షారామమైనదా? అటు పిమ్మట దక్షారామమైనదా?"

ఈ వాక్యము లర్థమగుటకు ముందు పాఠకులకు రెడ్డిగారుపేర్కొనిన "ముదివేము" గొడవ కొంత చెప్పవలసియుండును. తూర్పుచాళుక్య రాజుల శాసనములు కొన్నిటియందు వారి వంశచరిత్రము చెప్పుటలో వారిపూర్వులలో విజయాదిత్య నామాంకితుఁడగు రాజయోధ్యాపురము నుండి దిగ్విజయార్థము దక్షిణాపథమునకేతెంచి త్రిలోచన పల్లవునితోఁ బోరాడి రణరంగమున నిహతుఁడయ్యెననియు సద్యఃగర్భవతియగు నాతని భార్య ముదివేము నామాగ్రహారమునకేఁగి యచ్చట విష్ణుభట్ట సోమయాజి యను బ్రాహ్మణునిచే నిజపుత్రికయుంబోలె నాదరింపఁబడెననియు, నామెకుఁ గలిగిన కొమరునకు విష్ణువర్ధనుఁడను నామ ముంచిరనియు నాతఁడే వారికి మూలపురుషుఁడయి వెలసెననియుఁ జెప్పఁబడినది. ఇందు కనుగుణముగనే తూర్పుచాళుక్యరాజులు పలువురు తమ నామముల చివర విష్ణువర్ధన నామమునుగూడ ధరించిరి. మూలపురుషుఁడగు విష్ణువర్ధనుఁడు పుట్టిపెరిఁగిన యీ ముదివేము అగ్రహారమే మన రెడ్డిగా రుదాహరించినది. దీనికిని వేములవాడ భీమకవి జన్మస్థానమని పలువురు తలంచు గోదావరీజిల్లాలోని వేములవాడకును నెట్టిసంబంధమును లేదు. "వేము" అనుపదమును గైకొని బదరీబాదరాయణులకుంబోలె లేనిసంబంధమును ముడివెట్టుట ఘటనాఽఘటన సమర్థులగు రెడ్డిగారికే చెల్లినది. వేముల

వాడకు ముదివేములవాడయను వ్యవహార మెప్పుడునులేదు. చళుక్యశాస నములలో నుదాహృతమయిన యీ ముదివేము కడపజిల్లాలోని ముది యను గ్రామమై యుండునని చరిత్రజ్ఞులభిప్రాయపడుచున్నారు. అంతియే గాని వేములవాడతో నెట్టి సంబంధమును ముడిపెట్టుటలేదు. ముది వేము తియ్యగాఁబండి ద్రాక్షయగుట ప్రకృతివిరుద్ధము; లోకానుభవ శాలి వేమనయోగీంద్రుఁడు "తినఁగఁదినఁగ వేము తియ్యనై యుండును" అనుచెప్పెను. ముదివేముగాని లేఁతవేముగాని నేలవేముగాని తియ్యగాఁ బండి ద్రాక్షగాని ద్రాక్షారామముగాని యగుట లోకమందసంభవము. రెడ్డిగారిచేతులలోఁ గవులుకానివారు కవులవుచున్నారు. కావున "ముది వేము" ద్రాక్షారామ మగుటకూడ వారివ్రాఁతలయందే సంభవమగును గాని యన్యత్రకానేరదు. ఇఁక దక్షారామముమాట యేమనఁగా దక్ష వాటియగు దక్షారామమే లోకవ్యవహారములో రానురాను దాక్షా రామమయి తరువాత ద్రాక్షారామమయినది. అంతియేగాని ద్రాక్షా రామము క్రమక్రమముగా దక్షారామము కాలేదు. రెడ్డిగారు భీమేశ్వర పురాణమును బాగుగాఁ జదివికొని లోకజ్ఞతగ్రహించి యథార్థమును దెలిసికొందురుగాక. ద్రాక్షారామమని పేరేగాని యిప్పుడాప్రాంతమందు ద్రాక్షతోట లేమియులేవు. పూర్వముగూడ నుండినట్టు లెట్టి నిదర్శనము లులేవు. విధవాకుమారుఁడైన చాళుక్య విష్ణువర్ధనుని జన్మప్రకార కథ నమే తద్వంశజుఁడగు (ముది) వేములవాడ భీమన కంటఁగట్టఁబడినదని రెడ్డిగారు వ్రాయుట మఱియు నాశ్చర్యము. విష్ణువర్ధనుని జన్మవృత్తాంత నకును వాడుకకథలోని వేములవాడభీమకవి జననకథకును సామ్యమే లేదు. విష్ణువర్ధనునితండ్రి విమలాదిత్యుఁడు చనిపోవునప్పటి కాతనిభార్య గర్భవతిగానుండి నెలలునిండినపిదపఁ గుమారునిఁ బ్రసవించినది. అట్టి విష్ణువర్ధనునకు విధవాకుమార బిరుదమును రెడ్డిగారు ప్రసాదించుట న్యాయ్యమేనా? భీమకవితల్లి కేవలము విధంతువేగాని యామెకు దక్షా రామ భీమేశ్వరుని వరమువలననే భీమకవి యుదయించెనని వాడుకకథ.

పయిఁగా నీ లోకవ్యవహారమునుబట్టి భీమకవి బ్రాహ్మణుఁడేగాని క్షత్రియుఁడు కాఁడని వెనుక నేవ్రాసియుంటిని.

వేములవాడభీమకవి శాపానుగ్రహసామర్థ్యమును బ్రకటించు చాటుపద్యములు కొన్ని యాంధ్రవాఙ్మయమున నిప్పటికిని నిల్చియుండుట పాఠకులకు సువిదితమే. అందులో రాజకళింగగంగును గూర్చిన క్రిందిపద్యములు రెండును సుప్రసిద్ధములు.

ఉ. వేములవాడభీమకవి వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున సందడి దీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోస మిఁక ముప్పదిరెండుదినంబు లావలన్
జామున కర్ధమం దతని సంపద శత్రులఁ జేరుఁగావుతన్.

ఉ. వేయి గజంబులుండఁ బదివేలు తురంగము లుండ నాజిలో
రాయలగెల్చి సజ్జనగరంబునఁ బట్టముఁ గట్టుకో వడిన్
రాయకళింగగంగు కవిరాజు భయంకరమూర్తి చూడఁ దాఁ
బోయిన మీనమాసమునఁ బున్నమపోయిన షష్ఠినాఁటికిన్.

వీనినిగూర్చిన వాడుకకథలు యథార్థము లేమైనచో నిం దుదాహృతుఁడయిన కళింగగంగు క్రీ. శ. 1077 సంవత్సరములోఁ బట్టాభిషిక్తుఁడయి డెబ్బదిసంవత్సరములవఱకుఁ గళింగదేశమును బరిపాలించిన అనంతవర్మచోడగంగు కావలెననియు, ఉత్కలదేశమందలి జాజినగరమే సజ్జనగరము కానోపుననియుఁ జరిత్రజ్ఞులు తలంచుచున్నారు. ఈయనంతవర్మ చోడగంగునకు దక్షిణమున వేంగీచాళుక్యులతోను, ఉత్తరమున నుత్కలాధీశులతోను బడమరఁ జేదిదేశం బేలు కాలచుర్యులతోను యుద్ధములు ఘటిల్లి, తాత్కాలికముగ గెలుపులు నోటములుగూడఁ గలుగుచుండెడివి. మఱియు నీతనితండ్రియు నన్నయభట్టున కాశ్రయుఁడగు రాజరాజనరేంద్రుఁడును దోడియల్లుఁడు. వేములవాడ భీమకవి చిరకాలజీవియని వాడుక. నన్నయతో నాతనికి సమకాలికత్వముఁ గూర్చు నైతిహ్యములతో సమన్వయము చేసినను భీమకవి యనంతవర్మచోడగంగు

కాలమున నుండుటలో నసంభవ మేమియులేదు. ఇట్టి యెడ మనరెడ్డిగారీ పద్యముల కర్తృత్వముకూడ వేములవాడ భీమనకేయని, తాము తలంచు చాళుక్యభీమునకే యారోపించుచుఁ దత్సమర్థనమున కయి యవలంబించిన వింతమార్గముల విలోకింపుఁడు. చాళుక్యభీముని శాసనములు కొన్ని లోకమునకు దొరకినవి. అందులో క్రీ॥ శ॥ 892 నాఁటి అత్తిలిశాసనమును కీర్తిశేషులు శ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుపంతులుగారు వివరణముతో ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక (సం॥సం6) లోఁ బ్రకటించియున్నారు. అందులోఁ జాళుక్యభీముని పెదతండ్రియగు గుణగవిజయాదిత్యుని వర్ణనలో

"అథచకాలింగ గంగరూప్యాది, కోశ (స) వేశద్విపాదిచ,
పాండ్యపల్లవ హేమాది హరత్యా ఇత్థమాహరత్"

అనియున్నది. దీనికిఁ గళింగదేశాధీశులగు గంగరాజుల రజతాదికములను, కోసలదేశాధీశుల గజాదికములును, పాండ్యపల్లవరాజుల సువర్ణాదికములనుదాహరించి గుణగవిజయాదిత్యుఁడు విజయయాత్రలొనర్చెనని సహజమగు సమంజసార్థములను శ్రీ లక్ష్మణరావుగారు తెలుఁగున వివరించియేయున్నారు. కాని మనరెడ్డిగారు పయి శాసనపంక్తులను బరిషత్పత్త్రికనుండియే గైకొనియుఁగూడ శ్రీ లక్ష్మణరావుగారి వివరణ మేమియుఁ బాటింపక "కాలింగగంగ" శబ్దమొక్కటిదొరకినది గదా కృతార్థులమయితిమని తలపోసి, తమ విపరీతధోరణితో జమీన్రైతు ఉగాదికానుకలోని మొదటివ్యాసములో నిట్లువ్రాసియున్నారు.

"వేములవాడ భీమకవి కళింగగంగని సంపదశత్రులఁ జేరుఁగావుతన్" అని శపించిన చాటుపద్యముకలదు. దీనికనుగుణముగా క్రీ. శ. 892 సంవత్సరమందలి చాళుక్యభీముని అత్తిలిశాసనములో తనపెదతండ్రి గుణగవిజయాదిత్యుఁడు క్రీ శ. 892 సంవత్సరములో కాళింగగంగుని రజతాదులను (రూప్యాదులను) గ్రహించినట్లు కలదు. ఇందువల్ల కళింగగంగును శపించిన వేములవాడ భీమకవికూడ క్రీ. శ. 892 చాళుక్య

భీమునితండ్రి కాలమునాఁటివాఁడు. కాన చళుక్యభీమకవికి సమకాలికుఁడని నిర్ణయింపవచ్చును. ఇఁక నీయిద్దరికవులకు భేదమున్నదా? ఒకవేళ వేములవాడ భీమకవి- చాళుక్యభీమకవి కాకపోయినప్పటికి క్రీ. శ. 1053, సంవత్సర ప్రాంతమందలి నన్నయభట్టుకంటె క్రీ. శ. 892 సంవత్సర ప్రాంతమందలి (కళింగగంగు సమకాలికుఁడైన) వేములవాడభీమకవి ఆదిమకవియని నిర్ణయించుట సత్యదూరము కాదు. కనుకనే "వచియింతు వేములవాడ భీమసభంగి... ..."అని కాశీఖండములో రెడ్డివేమవిభుఁడు శ్రీనాథునిఁ బ్రశంసింపఁ గలిగినాఁడు. ఈఆంధ్రకవి ప్రశంసాకాలమును వేములవాడ భీమకవికి సమకాలికుఁడైన కాలింగ (కళింగ) గంగు ప్రస్తావన కల క్రీ శ. 892 సంవత్సరమందలి అత్తిలిశాసనము బలపఱుచుచున్నది. "వేములవాడ భీమకవి, వేగమె చూచి... ..." అనేచాటుపద్యార్థము క్రీ. శ. 892 గుణగవిజయాదిత్యుని లేక ఇతని తమ్ముఁడైన యువరాజ విక్రమాదిత్యుని యుద్ధసన్నాహమును శాఁపమిషతో చెప్పుచున్నది సంధికాఁబోలు. "వేయిగజంబులుండ... ..."అనే చాటువు మకల సజ్జనగరప్రాప్తిని శాపపరిహారమిషతోఁ జెప్పుచుండలేదా? యిదినిజమైనచో దీనివలన కాలింగగంగు క్రీ. శ. 892 సంవత్సరప్రాంతయుద్ధములో చాళుక్యభీముని పెదతండ్రి విజయాదిత్య రాజులనో లేక, ఇతనితండ్రి యువరాజ విక్రమాదిత్య రాజులనో గెల్చి సజ్జనగరమునఁబట్టముకట్టుకొన్నాఁడనికూడ చెప్పవచ్చును. ఇంతకును వేములవాడవంశజుఁడ దక్షారామ భీమేశనందనుఁడ<... ..." నానాకావ్యధుర్యుండ భీమన నాపేరు...' అనే చాటుపద్యమువల్ల వేములవాడ భీమకవి, దాక్షారామ చళుక్య భీమేశనందనుఁడని యూహింప నవకాశమున్నది" అత్తిలిశాసనములోని "కాలింగగంగ" శబ్దము కళింగదేశాధీశ సూచకమగు సాముదాయిక పదముగాని ప్రత్యేకవ్యక్తి సూచకము కాదని బుద్ధిమంతులకుఁ జెప్పనక్కఱలేదు. ఇష్టార్థసిద్ధికై యిచ్చవచ్చిన యర్థమును విచ్చలవిడిగఁ జేయువారికిఁ జెప్పఁదగినదిలేదు. చెప్పినప్రయోజనములేదు. రెడ్డిగారు

చాటుపద్యములందలి కళింగగంగు అనంతవర్మచోడగంగు కాఁదగునను చరిత్రజ్ఞుల యభిప్రాయముల నొప్పరికించి వానినిగూర్చి యించుకయుఁ దమ వ్యాసములలోఁ జర్చింపకుండుట శోచనీయము. పయిఁ జేర్కొనిన రెడ్డిగారి వాక్యములఁబట్టి మొదటివ్యాసమును వ్రాయునాఁటికి వారు చాళుక్యభీముఁడు వేములవాడ భీమకవి వేర్వేఱుపురుషులే కాఁదగున నెడి యనుమానముతోఁ గొంతవఱకుఁ ద్రొక్కులాడి, తుదకు వేములవాడ భీమకవి చాళుక్యభీముని నందనుఁడు కావచ్చుననెడి యభిప్రాయమును సింపుకొన్నట్లు కానఁగును; గాని విభూతిపత్రికలోని రెండవవ్యాసమును వ్రాయునప్పటికా యిరువురకు సంపూర్ణైక్యమునే సమ్మోదించినట్లు లా వ్యాసమందలి "వేములవాడ భీమకవికి వేములవాడ చళుక్యభీమకవి" దాక్షారామ చళుక్యభీమకవి, "చాళుక్యవంశ రాజధానియగు చాళుక్యభీమవర" చళుక్యభీమకవి, ఆదికవి భీమన అను పర్యాయనామములున్నట్లు స్పష్టమగుచున్నది." అను వాక్యములఁబట్టి తెల్లమగుచున్నది. చాళుక్యభీమవరము చాళుక్యవంశ రాజధానిగా నున్నట్లు లెట్టియాధారములు లేవు. చళుక్యభీమునిచే నిర్మింపఁబడుట లేక పునర్నిర్మాణము గావింపఁబడుట మూలముననే యాగ్రామమున కానామము గలిగెనను చరిత్రజ్ఞుల వ్రాఁతలను రెడ్డిగారు గుర్తింపకుండుట యాశ్చర్యము. వేఁగి, విజయవాడ, రాజమహేంద్రవరము కొంతకొంతవఱకు వేంగీదేశమునకుఁ జాళుక్యుల రాజధానులుగా నున్నట్లు చెప్పవచ్చును. చళుక్యభీముని కాలములో నాతఁడీరాజ్యమును విశాఖపట్టణమందలి యెలమంచిలిలోనుండి పాలించినట్లు లిదివఱకే చెప్పియుంటిని. మొదటివ్యాసము చివరను శ్రీ రెడ్డిగారు "కాని శ్రీనాథకవి సార్వభౌముఁడంతటి చాళుక్యభీమకవి కావ్యము లాంధ్రసారస్వత దురదృష్టమువల్ల కాలగర్భమున డాఁగియున్నవనుటకంటె మిగిలిన సాక్ష్యము లేదు" అను వాక్యమును లిఖించినారు. తగిన సాక్ష్యము లేదని తెలంచియు రెడ్డిగారు కారణాభాసములతో నిట్టి యపూర్వ సిద్ధాంతమును బ్రకటించుట సాహసమని నాయభిప్రాయము.

పాఠకమహాశయులారా? చళుక్యభీమనృపాలుండు కవియు నందు నను దేశీకవితఁ బుట్టించిన ప్రథమాంధ్రకవియు నగుట వాస్తవమే యైనచో నింతటి యుత్కృష్టవిషయము నాతఁడు తన శాసనములలోఁ జెప్పికొనియే యుండును. అతనిసంతతివారైనను దమశాసనములలో దాని నుగ్గడించియే యుందురు. అట్టిదేదియుఁ గానరాదు. వేయేల! రాజరాజనరేంద్రుని ముత్తాతకుఁ దాతయగు నీతనికిట్టి ప్రశస్తియే యున్నచో నన్నయభట్టారకుఁడే తన భారతమున దానిని బేర్కొనియుండును. రాజరాజనరేంద్రుని మనుమలు తమశాసనములలో నాతని భారతకృతిపతిత్వమును "ఆంధ్రీచకార" అను విశేషణముతో నుగ్గడించిరికదా! పూర్వకవు లొక్కరయినఁ జాళుక్యభీముఁడు ప్రథమాంధ్రకవియైనచో నాతనిని బేర్కొనకుందురా! ఇది కేవలము నేఁడు శ్రీ వేంకట కృష్ణారెడ్డిగారి మేధోరంగమునుండి యుద్భవించిన యద్భుతాపూర్వవృత్తాంతమేగాని యందులో సత్యము కించిత్తయిన లేదనియే నానిశ్చితాభిప్రాయము. విజ్ఞులు విశేషవిమర్శన మొనరించి యథార్థమును నిర్ణయింతురుగాక! "పృథ్వి నృపతులు నూతన ప్రియులుగారె" "క్రొత్త యొకవింత ప్రాఁత యొకరోఁత" యను నానుడులను విపరీతముగ గ్రహించి, శ్రీమంతులు ధీమంతులు నగు శ్రీ వేంకట కృష్ణారెడ్డిగా రిట్టి యాకాశహర్మ్యనిర్మాణములకయి తమ ధీసంపత్తులను వినియోగింపక సక్రమము సత్యసమ్మతమునగు సాహిత్యవిమర్శనమునకయి వానిని వినియోగించి చరితార్థు లయ్యెదరుగావుతమని సుహృద్భావముతో మనవి చేయుచున్నాను.

శ్రీమహీశూరమహారాజకృష్ణరాజేన్ద్ర సార్వభౌమస్మృతిః

కావ్యకలానిధి చిదమ్బరశాస్త్రి,
మైసూరుసంస్థాన శతావధానీ.

శ్లో. దాతా రసజ్ఞః కవికల్పశాఖీ కర్ణాటకక్ష్మాతలసార్వభౌమః ।
కృష్ణప్రభు ర్య ద్దివమభ్యగాత్త త్సుధీజనానాం దురదృష్టమేవ.

శ్లో. ఇక్ష్వాకు స్స ధరాపతిః కృతయుగాలఙ్కారభూతో గతో
రామో దాశరథి ర్గతస్స భగవాం స్త్రేతాయుగాలఙ్కృతిః ।
రాజా ధర్మతనూభవోఽపి చ గతస్స ద్వాపరాలఙ్కృతిః
శ్రీమాః కృష్ణమహీపతిః కలియుగాలఙ్కారభూతో గతః.

శ్లో. సన్తి క్షితీన్ద్రా బహవో ధరిత్ర్యాం
తేషాం కథాఽనేకవిధా తథాఽఽస్తామ్ ।
కృష్ణప్రభో ర్విశ్వజనీనగాథా
స్సచేతన శ్చేత్కథ్హ్వ విస్మరేత్కః.

శ్లో. సత్యవ్రతం కృష్ణవిభోస్స్మృతం చేన్న విస్మయం కస్య తనోతి జన్తోః ।
తత్తాదృశః క్ష్మాతలసార్వభౌమో గతో దివం హన్త విధే ర్బలేన.

శ్లో. ధర్మాణాం పరిరక్షణేఽపి తదనుష్ఠానేఽపి బద్ధాదరః
ప్రాయస్సమ్ప్రతి దృశ్యతే జనపతిః కృష్ణప్రభో ర్నేతరః ।
తస్మిన్ రాజకులోత్తమే గతవతి స్వర్గం విధేరాజ్ఞయా
ధర్మా నిశ్శరణాః కథం పర మితస్థాస్యంతి హన్త క్షితౌ.

శ్లో. స్వభావసిద్ధం నిధనం న శక్తో విలఙ్ఘితుం కోఽపి కుతో విషాదః ।
కృష్ణప్రభో శ్శాశ్వతకీర్తికాయః ప్రమోదహేతు ర్భవతాజ్జనానామ్.

సంస్కృతకవయిత్రులు-మఱికొందఱు.

(ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు, యం. ఏ.)

ఆంధ్రగీర్వాణభాషోపన్యాసకులు, పిఠాపురరాజకళాశాల, కాకినాడ.

అవతరణిక.—

'జనవాణి జన్మదినసంచిక' (ఆగష్టు 1937) లో 'వికటనితంబ' యను కవయిత్రినిగూర్చి నాఁటికి లభించినపరికరములతో నొకవ్యాస మును బ్రకటించితిని. తరువాత 'సచిత్రాంధ్రవారపత్త్రిక' (సంపు. 30. సంచిక ౧౫. డిసెంబరు 1937) లో నామెనుగూర్చిన విశేషాంశములను, ఫల్గుహస్తిని, ప్రభుదేవి, సుభద్ర, జఘనచపల, ఇందులేఖ యను కవయిత్రీపంచకమునుగూర్చి మఱియొక 'సందర్భము'ను బ్రచురించితిని. పిమ్మట 'జనవాణి' ('ద్వితీయజన్మదినసంచిక'—ఆగష్టు 1938) లో 'మారుల, మోరిక, చిన్నమ్మ, నాగమ్మ' యను నలువురు సంస్కృత స్త్రీకవులంగూర్చిన యుపన్యాసమును బ్రచురించితిని. కుతూహలము గలవారలు నాయాసంచికలను బరిశీలింతురుగాక! ఇటనాఱుగురు కవయిత్రులనుగూర్చి వివరింపఁబడును.

11. లక్ష్మీదేవీఠాకురాణి: (క్రీ. 15 వ శతాబ్దము)

ఈమె మిథిలాధినాథుఁడై, క్రీ. 15 వ శతకమున రాజ్యపాలన మొనరించిన శివసింహప్రభువుయొక్క పట్టమహిషి. చక్కనికవయిత్రి. ఈమె పద్యములు రెండుమాత్రము లభించినవి. అందు మొదటిశ్లోక మును ద్వాదశరాసులనామముల నిమిడ్చి యెట్లు మనోజ్ఞముగా రచించెనో గమనింపఁదగును.

౧. శ్లో. 'ఆక్రాన్తా దశమధ్వజస్య గతినా, సమ్మూర్ఛితా విగ్లతే
తుర్యద్వాదశవద్, ద్వితీయమతిమ, త్వం కాదశాధ స్తనీ
సా పఙ్క్తీ కటిపఞ్చమీ చ, నవమభ్రూ, సప్తమీనాశ్రితా
ప్రాప్నో త్యష్టమవేదనాం, త్వ మధునా తూర్ణం తృతీయో భవ'.

వివాహోచితవయస్క యయ్యు నవివాహితయై మదనశరవిద్ధ యగు నొకానొకస్త్రీయవస్థ యిట వర్ణింపఁబడెను.

కాంచీపురసమీపమునందలి అగరంగ్రామవాసియగు ఏ. యం. శ్రీనివాసాచార్యపండితుఁడుకూడ నిట్టిచమత్కారముం జూపుచురచించిన యీక్రిందిపద్యము నవలోకింపఁదగును.

౧. శ్లో. 'మేషారోహనిభం నరీత్య వృషభం మత్వాత్వయా ద్వన్ద్వభా
వాస్త్రైక కర్కటకత్ ప్రతిపగమనా సింహేవ లగ్నాశ్ఛితా
కన్యా సా తులాపి వృశ్చికసమైర్బాణైర్ధనుర్వ్యర్పితై
రాముక్తా మకరధ్వజేన కలితా, కుమ్భస్తనీ మీనదృక్.'

౨. శ్లో. 'చపలం తురగం పరివర్తయతః
పథి పౌరజనాన్ పరిమర్దయతః
నహి తే భుజభాగ్యభవో విభవో
భగనీభగభాగ్యభవో విభవః'—('లక్ష్మీనారాయణాస్యః.')

---

† ఈపద్యమునకుఁ బాశ్చాత్యసంస్కృతవిద్యాదర్వితంసుఁడగు గ్రియర్సన్ పండితుఁడు (Dr. G. A. Grierson) ప్రాచీనభారతీయజ్ఞానవిచారకమగు 'ఇండియన్ అంటిక్వరీ' (Indian Antiquary, Vol. XV. p. 318) అను మాసపత్రికలోఁ జిరకాలముక్రిందటనే యొసఁగిన యాంగ్లభాషానువాదము మాత్ర మిట నుల్లేఖింపఁబడును. సహృదయు లూహించుకొందురుగాక.

'Attacked with the severe onslaught of the God of Love is she; distraught like a craft or a fish in a dry place is she; Oh! thou bull-minded one, the damsel, round of arms as a water jar, with arched eye-brows (the destined wife of thou who art like a shop-keeper's wife who plies the scales (who has no equal). She feels pain like that of a scorpion bite. Surely, let the resu't of married life relieve her'.

పైశ్లోకము 'సూక్తిసాగర'మను సముద్రిత సుభాషితకోశమున మనకవయిత్రి కృతముగాఁ గనఁబడుచున్నది. కాని యాంధ్రదేశమున నొక యితిహాస మీశ్లోకమునుగూర్చి వినవచ్చుచున్నది; యెంతవఱ కిది సత్యమో చెప్పఁజాలము.

ధారానగరాధినేతయగు భోజుని రాణి లీలావతీదేవి. ఈమెకు సైరంధ్రి కించుకవతి. ఈమె కూఁతురు కాంచనమాల. ఈమెను రాజస్యాలకుఁడగు లీలావతిసోదరుఁడు వలచి యొకనాఁ డతిదౌర్జన్యమున నామెను దనగుఱ్ఱముపై నెక్కించుకొని పోవుచుండెను. వేశ్యయైనను గాంచనమాల కాతనిపొడ గిట్టదు. కాళిదాసుఁడను కవిపై నామెకుఁ బ్రేమ మెండు. దైవయోగమునఁ గాళిదాసకవి వారికెదురుపడి పైశ్లోకముచే రాజస్యాలకుని నిపుణముగా నుపాలంభించి, యామెను వాని చెఱ నుండి విడిపించెనఁట.†

(దారికడ్డువచ్చిన పురజనులను గొట్టుచు నిపుణముగా గుఱ్ఱపు స్వారిచేయు నీవైభవము నీసోదరియందు మక్కువకలిగియుండు నామె భర్తయొక్క దాక్షిణ్యవిశేషమునఁ గలిగెను గాని నీభుజబలమువలనఁ గలిగినది కాదని భావము.)

12. త్రివేణి: (క్రీ. 1817-1883)

దాక్షిణాత్యవిదుషీరత్నము, కవయిత్రి, బహుగ్రంథకర్త్రి. ఉదయేంద్రపురవాసి, 'యాదవరాఘవపాండవీయ' మను త్ర్యర్థకసంస్కృతకావ్యరచయితయునగు అనంతాచార్యుల పుత్రిక. శ్రీపెరుంబూదూరు

† ఈపద్యమును గతను శ్రీ చిలకపాటి రామానుజశర్మగారు 'కాళిదాసచరిత్రప్రకరణము'న (119-122 పు.) నుదాహరించియున్నారు. ఇందుఁజేర్కొనఁబడిన కాళిదాసకవి సుప్రసిద్ధరఘువంశాదికృతికర్త కాఁడనియుఁ, దన్నామసాదృశ్యముగల వేఱొక కవి కావచ్చుననియుఁ, బ్రఖ్యాతుఁడగు కాళిదాసమహాకవికంటె భోజుఁడు కొన్నివందల సంవత్సరము లర్వాచీనుఁడనియు నెఱుఁగఁ జనును. శర్మగారిపాఠమునఁ బై పద్యమున కించుక పాఠభేదము గలదు: 'చపలం'—'చతురం', 'భుజభాగ్య' 'భుజవీర్య' (కాళిదాసచరిత్రప్రకరణము—కపాలిముద్రాక్షరశాల, చెన్నపురి, 1908.)

పట్టణవాసియగు ప్రతివాదిభయంకర వేంకటాచార్యులీమె భర్త. ఈమెకుఁ ద్రివేణియను నామము నిడుటకు హేతు వేమన—కావ్యమును నదితోఁ బోల్చుట ప్రాచీనకవిసంప్రదాయము.

కవిరాజసూరి 'రాఘవపాండవీయము'న

'శ్రీమద్రామాయణం గఙ్గా, భారతం సాగరో మహాన్
తత్సంయోజన కార్యజ్ఞః కవిరాజభగీరథః
మనోజ్ఞరామాయణభారతాఖ్య
భాగీరథీసాగరసంవిహాతే
స్నాః ప్రసర్వస్వవగాహలీలా
మస్మిన్నఘచ్ఛేదిని కావ్యతీర్థే.'—1 స. ౪౧, ౪౪ ప.

అని రామాయణమును గంగానదితోఁ బోల్చియున్నాఁడు. ఇట్లే యనంతాచార్యకవి భారతభాగవతరామాయణములను మూఁడుకావ్యనదులను (గంగాయమునాసరస్వతులు ప్రయాగలో సంగమము నందినట్లు) 'యాదవరాఘవపాండవీయ'మను తనకావ్యమున సమ్మేళనము చేసెను. త్రివేణీసంగమమువలెఁ బవిత్రమగు తనకావ్యరచన పూర్తియగుటతోడనే యాతనికిఁ బుత్రికాలాభము కలిగెనఁట. అందువలన నీకన్యామణికిఁ ద్రివేణియను పేరొసఁగఁబడెనఁట. వివాహమునకుఁ బూర్వమే యీమెకవితాప్రజ్ఞ ప్రస్ఫుట మగుచుండెనఁట! జగద్విఖ్యాతకీర్తి నందిన సరోజినీదేవి కడుబాల్యముననే 8000 పాదములుగల యాంగ్ల కావ్యమును రచించెనని తెలిపినచో బాలకవయిత్రియగు త్రివేణిప్రజ్ఞ మనకంత విడ్డూరముగాఁ గన్పట్టదు. వివాహానంతరము భర్తృచరణారవిందముల సన్నిధి నీమె దర్శనములఁ బరించెను. ఏకైకపుత్త్రుఁడు లేనకన్నులయెదుట చనిపోవుటచేతను, భర్త యకాలమృతినందుటచేతను నీమె వైరాగ్యము చెంది సన్న్యాసినిగా జీవితశేషమును వెళ్లఁబుచ్చెను.

ఈమె రచించిన 'హారతిపంచకము'ను విని యానందించి యచ్చటి 'జిల్లాకలెక్టరు' ఆప్రాంతముల దొరకిన కొన్నివిగ్రహముల నీమెకొసఁగెను. ఈవిగ్రహములఁ బ్రతిష్ఠించుటకై యీమె యొకయాలయమును

నిర్మింపఁదలఁచి తిరువానూ్కరుసంస్థానమున కరిగెను. అక్కడ నీమె విశేషముగా సత్కరింపఁబడెను. మైసూరుసంస్థానప్రధానామాత్యులగు దివాన్ రంగాచార్యులువారికి నీమెయెడ విశేషగౌరవ ముండెడిది. వారి సమాదరణమువలననే యీమె యాలయనిర్మాణమును గొనసాగింపఁ గలిగెనఁట. ఈకవయిత్రి రచించిన గ్రంథము లనేకములు గలవు. ఎట్టి క్లిష్టసమస్యలనైన నాశువుగాఁ బూరించుటయందీమె కసదృశప్రజ్ఞ కలదు. సంస్కృతస్త్రీకవులలో నీమెరచించినన్ని కావ్యముల మఱెవ్వరును రచించియుండలేదు. ఏకావ్యప్రసూనములచే నీమె సంస్కృతశారదారాధన మొనరించె నన—

అ. స్తోత్రాత్మకములగు కావ్యములు—

౧. లక్ష్మీసహస్రము.   ౨. రంగనాథసహస్రము.

ఈరెండును వేదాంతదేశికుల 'పాదుకాసహస్రము'ను, వేంకటాధ్వరి 'లక్ష్మీసహస్రము' నాదర్శముగాఁ గొని రచింపఁబడియుండును.

ఆ. రసగర్భములగు లఘుకావ్యములు, ((Lyrical poems.)

3. శుకసందేశము. †   ౪. భృంగసందేశము. †

ఇ. మహాకావ్యములు—

౫. రంగాభ్యుదయము.   ౬. సంపత్కుమారవిజయము.

ఈ. నాటకములు—

౭. రంగరాడ్సముదయము.   ౮. తత్త్వముద్రాభద్రోదయము.

ఇందీకడపటి గ్రంథము కృష్ణమిశ్రుని 'ప్రబోధచంద్రోదయము' వలెను, వేదాంతదేశికుల 'సంకల్పసూర్యోదయము'వలెను నాధ్యాత్మిక విషయవిచారకమగు (Allegorical) రూపకము.

13. లక్ష్మీరాజ్ఞి—(క్రీ. 19 వ శతాబ్ది.)

ఈమె కడతనాడు, ఇకవలం, కోవిలోగం ('Kadathanadu, Ikavalam, Kovilogam') అను మలబారుదేశమునందలి పట్టణ

† ఈనామములతో నితరకవులు రచించిన సంస్కృతకావ్యములను గూర్చి మదీయ 'సంస్కృతదూతకావ్యచరిత్రము' (1937) ను జూచునది.

ములకు రాణి. క్రీ. 1890 ప్రాంతముల జీవించియుండెను. ఈమె 'సంతానగోపాలకావ్య' మను మూఁడు సర్గములకావ్యమును నిర్మించెను. భాగవతమునందలి దశమస్కంధమునను, హరివంశమునను గానవచ్చు నీకథ యిందలి యితివృత్తము—

ఒకానొక బ్రాహ్మణుని కొడుకులు పదిమందియు నొకరివెనుక నొకరు చనిపోవుట. అర్జునుఁడు కడపటిశిశువును రక్షించెదనని ప్రతిజ్ఞ చేసి, విఫలుఁడై యగ్నిప్రవేశము చేయనెంచుట. అప్పుడు శ్రీకృష్ణుఁడాతనిని వారించి, చనిపోయిన పదిమందిశిశువులను వైకుంఠమునుండి తీసికొనివచ్చి, బ్రాహ్మణు ననుగ్రహించి, యర్జునుని రక్షించుట.

ఈకావ్యమునఁ దృతీయసర్గము యమకప్రచురముగా నుండును.

14. జ్ఞానసుందరి: (క్రీ. 19-20 శతాబ్దములు.)

ఈమె వేశ్య, కుంభకోణనివాసిని. 1910 వ సంవత్సరప్రాంతములఁ గాలధర్మమునందెను. శ్రీవత్సగోత్రజులగు కుప్పుస్వామిశాస్త్రివర్యుల శిష్యురాలు. ప్రసిద్ధకవయిత్రి. ఈమెవక్తృత్వనైపుణిని, బద్యపఠనకౌశలమును, గానకళాప్రావీణ్యమును జెవులార విని, యామె నాట్యమును గన్నులారఁ గాంచి యమందానందము నందిన వృద్ధులనేకులు నేఁటికిని దాక్షిణాత్యమండలముల యందున్నట్లు తెలియుచున్నది. మధురానగరవాసియగు ఆర్. ఫిషర్ (R. Fisher) అను నుత్తమన్యాయవాది (బారిష్టర్) యీమెకుఁ బ్రధానాశ్రయుఁడఁట. ఈమె తనకవితాప్రావీణ్యమును మైసూరుసంస్థానమునఁ బ్రదర్శించి, యామహారాజుచే 'కవిరత్న' బిరుదముచే సన్మానింపఁ బడెను. తా ననేకగ్రంథములను రచించిన ట్లామెయే చెప్పుకొనెను. కాని వీనిలో 'హాలాస్యచంపువు' †మాత్రము లభించినది. ఇందు దాలుస్తబకములు గలవు. మధురయందలి మీనాక్షీసుందరేశుల వివాహాదికవృత్తాంత

---

† శ్రీ విద్యాముద్రాలయమున ముద్రితము, కుంభకోణము, 1906.

ము లిందు వర్ణింపఁబడెను. ఈమెకవిత ప్రాయికముగా ననుప్రాసప్రచు రముగా నుండును. మచ్చునకు రెండు పద్యములు:

౧. శ్లో. 'మధురీకృతగరళత్వాత్ మధురాభిఖ్యా తదాది సా నగరీ
నిజసీమస్థఫణిత్వాత్ విభాతి హాలాస్యనామతశ్చేహ.'

పై పద్యమున మధురకు హాలాస్యపురమనియు, మధురాపుర మనియు, నామములు గల్గుటకు హేతువు నిరూపింపఁబడెను.

౨. శ్లో. 'తస్యా లలాటలీనస్యాహోపతిరివ కాన్తసన్తాపః
శేతే కుఙ్కుమతిలకవ్యాజాన్మానం బుధా హి కాలవిదః.'

ఈమెశయ్య యంతసరళముగా నుండకు గాని, యీమెకుఁగల గీర్వాణభాషాప్రౌఢి తత్కావ్యమునఁ బ్రస్ఫుటమగుచుండును.

15. శ్రీ దేవీబాలరాజ్ఞి—

పేరునుబట్టి యీమె రాణియని యూహింపఁజనును. ఈమె దేశ కాలములు ప్రకృతము తెలియవచ్చుటలేదు. ఈకవయిత్రి శ్రీమద్భాగవ తమునందలి కథలను గైకొని 'చంపూభాగవత'మను కృతిని రచించెను. భాగవతమును సంస్కృతమునఁ జంపువుగ రచించిన కవీంద్రు లనేకులు గలరు. వారినామముల నిటఁ బేర్కొందును. ౧. అనంతనారాయణ పుత్త్రుఁడగు చిదంబరకవి. ౨. కుమారడిండిమునితనూజుఁడగు మూఁడవ రాజనాథుఁడు. 3. వెల్లాలకులోత్పన్నుఁడు నాంధ్రదేశీయుఁడు నగు అభి నవకాళిదాసకవి. ౪. అభినవకాళిదాస-గోపాలశాస్త్రి. ౫. కొల్లూరి రాజశేఖరకవి, ఆంధ్రదేశస్థుఁడు. ౬. భారతచంపువును రచించిన అనంత భట్టు. ౭. రామభద్రకవి.

16. రాధాప్రియ—

ఉత్కలదేశమున (ఒరిస్సా) నొక మహారాజును, రఘునాథదేవ వర్మతనూజుఁడునగు విశ్వనాథదేవవర్మకుఁ బట్టపురాణి కవయిత్రి రాధా ప్రియ. భార్యాభర్త లిరువురును గలిసి 'రాధాగోవిందశరద్రాస'† మను

---

† 11 వ ప్రకరణము, ఉత్కలసాహిత్యముద్రాలయము, అత్ఘర్ (Athgurh, Orissa) 1917.

* 'రాధాప్రియ' వ్యాఖ్యతో ముద్రితము, ఉత్కలముద్రణాలయము, కలకత్తా, 1915.

పద్యకావ్యమును రచించిరి. ఇందు రాధాకృష్ణుల శరత్కాలరాసక్రీడలు వర్ణింపఁబడెను. రాజకవి యగు విశ్వనాథదేవవర్మ రుక్మిణీకృష్ణులవృత్తాంతమును 'రుక్మిణీపరిణయము'* (చరితము) అను నామముతో 11 సర్గముల మహాకావ్యమును రచించెను. పట్టమహిషి, విద్వత్కవయిత్రీమతల్లియునగు రాధాప్రియ భర్త రచించిన మహాకావ్యమునకు 'రాధాప్రియ'యను నొక ప్రౌఢవ్యాఖ్యను రచించెను. సంస్కృతభాషావాఙ్మయములలోఁ గఠోరవ్యవసాయ మొనరించిన నారీమణులే బహువిరళము. అందును కృతినిర్మాణదక్షులగు విదుషీమణు లింకను విరళము. అట్టియెడ భార్యాభర్త లిరువురును సంస్కృతమునఁ జక్కని పాండితిని బడసి కవితాపాండితీస్ఫోరకములగు గ్రంథముల రచించుట యద్భుతానందజనకముగా నున్నది. క్రీ. 17 వ శతాబ్దిలో వంగదేశమున మహాపండితుఁడగు కృష్ణనాథుఁడును, విదుషీమణియగు నాతని ధర్మపత్నియుఁ గలిసి 'ఆనందలతిక'యను చంపువును సంస్కృతమున రచించిరి. 18 వ శతాబ్దమున దక్షిణదేశమున విలసిల్లిన ఘనశ్యామవిద్వత్కవియు నాతని ధర్మపత్నులు విదుషీమణులునగు సుందరి, కమలయుఁ గలిసి రాజశేఖరుని 'విద్ధసాలభంజిక'కు వ్యాఖ్య రచించినట్లు ఘనశ్యాముని వాక్యమును బట్టి తెలియుచున్నది.

ఉపసంహృతి—

కాలాంతరమునఁ దక్కిన గీర్వాణకవయిత్రులంగూర్చిన వ్యాసములు ప్రచురింపఁబడును. సంస్కృత కవయిత్రులంగూర్చి డాక్టర్ మాడభూషి కృష్ణమాచార్యులుగారు(యం.ఏ., యం ఎల్., పి హెచ్ డి) డాక్టర్. వి. రాఘవన్, డాక్టర్. యతీన్ద్రవిమలచౌధురి, (యం. ఏ., పి. హెచ్ డి.) మొదలగు విజ్ఞులువ్రాసిన గ్రంథములు నాకెంతయు నుపయోగించినవి.

ఉపోద్ఘాతము.

ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించిన ఛందోలక్షణగ్రంథములలో లక్షణసారసంగ్రహమును మిక్కిలి విలువగలగ్రంథమని చెప్పవగును. ఆంధ్రవాఙ్మయమున నింతకు మున్నేలాక్షణికులుగాని యాలంకారికులుగాని తమగ్రంథములలోఁ జెప్పని నాటకలక్షణముల నీకవి తెలిపియున్నాఁడు. మఱియు నేఁటిదనుక నాంధ్రకవిపండితలోకమునఁ బ్రచురప్రచారమునను యప్పకవీయమునకు నీగ్రంథము కొంతవఱకు మూలమని చెప్పినచో నీగ్రంథప్రాశస్త్యము తేటపడకమానదు. కావునఁ బరిషత్తువారీగ్రంథముఁ బ్రకటించి యాంధ్రకవిపండితులకే కాక, ఛందోలక్షణపరిణామము నెఱుఁగఁగోరు విమర్శకులకుఁగూడ దీనిని నుపాదేయముగ నొనరించినారు.

పరిషత్తున కీగ్రంథమునకు మాతృకయొక్కటియే చిక్కినది. ఇప్పటికి రమారమి పదునెనిమిదేండ్లక్రిందట, కీ. శే. కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుపంతులవారీలక్షణసారసంగ్రహమును హరిభట్టురచితమగు నుత్తరనారసింహపురాణమును బరిషత్తునకై మైసూరు దొరతనమువారియొద్దఁ గొనియుండిరి. వీనిలో నుత్తరనారసింహపురాణ మిదివఱకే పరిషత్తువారిచేఁ బ్రకటింపఁబడినది. ప్రస్తుతము ప్రకటితమైన లక్షణసారసంగ్రహము పరిషత్పుస్తకభాండాగారమున 4441 వ సంఖ్యగలది. ఇం దిరువదియాఱు తాళపత్రములు గలవు. పత్రమునకుఁ దొమ్మిదిపంక్తులు. వ్రాఁత చక్కఁగ నున్నది. గ్రంథాంతమున "శ్రీమత్తాదిరీశాయనమః శ్రీసూర్యనారాయణాయనమః శ్రీశారదాంబాయైనమః శుభమస్తు శ్రీమత్తాదిరీనృసింహస్వామి సత్కృపను చిత్రకవి బుచ్చయార్యులతేంమును రామాచార్యులు వ్రాసిన లక్షణసారసంగ్రహమునకు శుభమస్తు. దుర్ముఖసంవత్సర పుష్య శు॥ల్లు" అనికలదు. లక్షణసారసంగ్రహము నేకాక యుత్తరనారసింహ

పురాణమును గూడ వ్రాసిన దీ రామాచార్యులే యని యాగ్రంథతాళ పత్రమాతృక చివరఁగల యీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

"క. ధర శుభకీలకసంవ
త్సరమున శ్రావణమునందుఁ దగఁ జిత్రకవీ
శ్వరు బుచ్చయార్య తమ్ముఁడు
వరమతి నరసింహు కథయు వ్రాసెను వేడ్కన్."

ఈగ్రంథముల వ్రాసినయాతఁడు కేవలవ్రాయసకాఁడు మాత్రమే కాక, కవియై యున్నాఁడు. ఈతఁ డనంతపురమండలములోని ఖదిర నివాసుఁడై నట్లు పై వ్రాఁతవలన మనకుఁ దెలియవచ్చుచున్నది. ఈతఁడు రఘునందనవిలాసము లేక భోజభూపాలీయ మనుపేర చంపూరామాయణమును దెలిఁగించియున్నాఁడు. పరిషత్పుస్తకభాండాగారమున నాగ్రంథము కలదు ఇందుల గద్యమున సీతనియింటిపేరు 'విక్రాల' అని కలదు. చిత్రకవి యాతని బిరుదనామము కావచ్చును; కావున లక్షణసారసంగ్రహకర్తయగు చిత్రకవి పెద్దనయు సీతఁడును నొక్కవంశమువారని యూహింపఁజనదు. చిత్రకవి పెద్దన యాజ్ఞవల్క్యుఁడు. చిత్రకవి రామాచార్యులు వైష్ణవుఁడు.

ఈ లక్షణసారసంగ్రహము తాళపత్రములు మిక్కిలి ప్రాఁతవియగుటచే నందు సూచింపఁబడిన దుర్ముఖసంవత్సరము మొన్నటిదిగాక యీ పైదాని పై దుర్ముఖ యగును. కావున నిది యిప్పటికి నూటయేఁబది సంవత్సరములపూర్వమే వ్రాయఁబడినదని చెప్పనొప్పును.

గ్రంథకర్త చిత్రకవిపెద్దన శుక్లయజుశ్శాఖీయుఁడు.* కాత్యాయనసూత్రుఁడు. భారద్వాజగోత్రుఁడు. ఈతనియింటిపేరు తొలుత పార్శ్వంచాలవారు. పెద్దననాఁటినుండి వీరు చిత్రకవి వారైనారు. ఈవంశమునఁ బెద్దనతరువాతఁ బండితులు కవులును గూడ విలసిల్లిరి. వీరివంశవృక్షమిది.

---

* ఈతఁ డార్వేలనియోగిబ్రాహ్మణుఁడని వీరేశలింగకవికృత కవిజీవితములలో వ్రాయఁబడియున్నది. అది ప్రామాణికము. చూ. ద్వితీయభాగము. పుట. 298.

మంచిరాజు-(మాచిరాజు) పార్శ్వంచాలవారు.
|
కాచన్న.
|
చెన్నన్న.
|
సర్వన్న-లక్షమ్మ.
|
పెద్దన-(చిత్రకవివారు)
|
అనంతకవి-ఓబలాంబ.
|
వేంకటరమణకవి.

చిత్రకవిపెద్దన నల్లగట్ల మైలన్నదౌహిత్రుఁడు. కందాళయన్న గారి శిష్యుఁడు. శ్రీహనుమద్వరస్థిరసత్కవిత్వదక్షుఁడు. చిత్రకావ్యధనుఁడు. ఈతనికొడు కనంతకవి హరిశ్చంద్రనళోపాఖ్యానమునకుఁ డీకవ్రాసి, గండికోటదుర్గాధ్యక్షుఁడగు పెమ్మసాని చినతిమ్మానాయునిచే గారవింపఁబడినవాఁడు. ఈతఁడు హరిహరశ్లేషోదాహరణము, సకలజీవసంజీవని, వంశావళి, ఇందుమతీపరిణయము మున్నగుగ్రంథములఁ బెక్కిటిని రచియించి యున్నాఁడు. మనుమఁడు వేంకటరమణకవి సాంబవిలాసమను విద్వత్కవి కర్ణరసాయన సకలవర్ణనాపూర్ణరామాయణము కుమారగురువిలాసమును రచియించియున్నాఁడు. అప్పకవి, సాంబవిలాసమునుండి నాలుగు పద్యముల నుదాహరించుటచేతనే యీతనిగ్రంథప్రాశస్త్యముఁ దెలిసికొనవచ్చును.

చిత్రకవిపెద్దన హనుమద్భక్తుఁడు. ఈతఁడు హనుమంతుని కంకితముగ నొకశతకము రచియించినాఁడని యాగ్రంథమువలనఁ దెలియుచున్నది. గాని, యది యిప్పుడు కానరాకున్నది.

పెద్దన నివాసస్థలమేదియో తెలియరాలేదు; కాని లక్షణసార సంగ్రహమున" నుతవేలూరిపురీ హనూమంతునకున్ (1-17) వెల్లూరి హనుమన్మూర్తీ (3-1) అని వేలూరు పేర్కొనటచే నిదియే యాతని నివాసమని యూహించుట సమంజసము. వేలూరు కడపజిల్లాలో గండికోటతాలూకాలోఁ గలదు.[1] తొలుత వీరియింటిపేరు, వీరు పార్నంచాలలో నుండుటవలన నేర్పడియుండును. పార్నంచాల కర్నూలుజిల్లాలో గండికోటకూరునకు నైఋతిదిక్కై క్రోశదూరములో నున్నది.[2] కావున వీరు మొదట పార్నంచాలలో నుండి యావెనుక పెద్దననాఁటికి వెలూరు చేరుకొనియుండురు. పెద్దనకొడుకు వసంతకవి కడపమండలమునఁగల గండికోటదుర్గాధ్యక్షునిచే గౌరవింపఁబడియుండుటచే వీరు కడపమండలములోని గండికోటసీమలోఁగల వెలూరిలో నెలకొనియుండిరని చెప్పుటకు వీలగుచున్నది.

పెద్దన క్రీ. శ. 1550 ప్రాంతములనున్న లాక్షణికుఁడని యీక్రిందిపద్యముచేత నిరూపింపవచ్చును.

ఉ. త్ర్యక్షవరప్రసాదకవితాఢ్యుని వేములవాడభీము, న
య్యక్షతభక్తివిస్ఫురదనంతు, వసంతు, కవిత్వలక్షణా
ధ్యక్షులఁ గాచిరాజు బసవార్యుని, భైరవు నూత్నదండి వా
గ్వీక్షణకర్ణ నేతయగు వెల్లఁకి తాతబుధేంద్రు నెన్నెదన్. 1-3

పైని బేర్కొనినవారలలో 'నూత్నదండి' కేతన యాంధ్ర భాషాభూషణమను వ్యాకరణము మాత్రమే రచియించియున్నను ఛందోలక్షణకారులతోపా టాతని పేర్కొనుట యాతనియందుఁగల ప్రత్యేకగౌరవము చేసని తెలియవలెను. ఈతఁడు క్రీ. శ. 1250 ప్రాంతమువాఁడు. పైవారిలోఁ గాలక్రమమున వెల్లంకి తాతంభట్టు కడపటివాఁడు. ఈతఁడు క్రీ. శ. 1500 ప్రాంతమువాఁడు. పెద్దనను క్రీ. శ. 1570 ప్రాంతమువాఁడగు లింగమకుంట తిమ్మన తనసులక్షణసారమున నిట్లు పేర్కొనినాఁడు.

---

1 Sewell List of Antiqnities Page 260
2 do. Vol. II Page 89

చ. అనుచు నదేమొకో మన రయంబున లక్షణసారసంగ్రహం
బొనయ వచించెఁ జిత్రకవి పెద్దన లెస్సవు పోధు వోధృశ
బ్దనయతఁ గానరో విశదరీతిగ్నన తెంలయు ధన్యులయ్యె మే
ల్గన భ్రమఁ గాంతు రాశ్లల నొకానొకచోటఁ బరాకుఁ గ్రమ్మఁగన్.[1]

కావునఁ జిత్రకవి పెద్దన క్రీ. శ. 1550 ప్రాంతమువాఁ డనుటకు సాధనము లనేకములు గలవు. పెద్దన కందాళయన్నగారి శిష్యుఁడు. ఈ కందాళయన్నగారు కందాళ యప్పగారి తండ్రి. కందాళయప్పగారు కాలమున మహాప్రసిద్ధిఁ జెందిన వైష్ణవాచార్యులు. పాండురంగమాహాత్మ్యకృతిపతి విరూపాద్రికిని, చిత్రభారతకృతిపతి వెనములపల్లి పెద్దనామాత్యునకును వైజయంతీవిలాసకృతికర్త సారంగు తమ్మయకవికిని గురువులై విలసిల్లినవారు. ఈకృతికర్తలు కృతిభర్తలును, క్రీ. శ. 1550, 1560 ప్రాంతములలోనుండి యొకజడముడిలోనివారని చారిత్రకముగ నిరూపింపవచ్చును. మఱియు కందాళ యన్నగారిని చేర్కొనిన శాసనము క్రీ. శ. 1522 నాఁటిది తిరుపతిదేవస్థానమునఁ గలదు[2]. అతని శిష్యుఁడగు పెద్దన క్రీ. శ. 1550 ప్రాంతమువాఁడని నిశ్చయముగఁ జెప్పవచ్చును.

ఈగ్రంథమున లక్షణములేగాని లక్ష్యములు లేవు. కాని లక్ష్యలక్షణములుగల గ్రంథ మీపెద్దనకవిది యీపేరితో నున్నదేమోయని యీక్రింది వ్రాఁతలవలన నూహింపనై యున్నది.

క్రీ.శ. 1909 వ సంవత్సరమున నన్నెచోడుని కుమారసంభవమును ప్రకటించి దాని పీఠికలో శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రిట్లు వ్రాసి యున్నారు.

“ఈకవి ప్రఖ్యాతుఁడు కాకపోవుటకుఁ గారణము. “బహుల్లో సామాన్యమతిత్వేన తేషాం పరిగ్రహో లోకే, కామం గతా ప్రసిద్ధిం సామా

1 ఈసందర్భమున చూడుఁడు లక్షణసారసంగ్రహము ద్వితీయాశ్వాసము, 8 పద్యము.

2 T. T. Devastanam. Archelogical Report Page 217.

స్యైకవయః అతఏవ" అని యూహింపవలయును. అయినను కుమారసంభవము లోని పద్యము 'లధర్వణచ్ఛందము పెద్దనలక్షణసారసంగ్రహము, కవిసంజీవని, రత్నాకరము, లక్షణశిరోమణి వీనిలో నుదాహరింపఁబడినవి. (పుట ౩.)

పెద్దన లక్షణసారసంగ్రహములో ౬ వ ఆశ్వాసమునండియు రత్నాకరకర్త ౧ వ యాశ్వాసమునుండియుఁ బద్యము లుదాహరించి యున్నారు. ఇందఱుచూచిన కృతి నేఁటి కెట్లు గ్రొత్తదగును?" (పుట ౪)

లక్షణసారసంగ్రహము పెద్దనదియని స్పష్టముగఁ గవిగారు తెలుపుచుండుటచేతను, వేఱొక పెద్దనరచియించినది మనకు నేఁటివఱకు లభ్యము కాకుండుటచేతను కుమారసంభవపీఠికయం దుదాహృతమైన దిపుడు పరిషత్తుప్రకటించిన గ్రంథమేయని యూహించుట సమంజసము గదా! అట్లయిన నిందు లక్షణము లేగాని లక్ష్యములు లేవు. కవిగా రుదాహరించినది వేఱొకలక్షణసారసంగ్రహమగునా యని సందేహించుచుండ నాసంవత్సరముననే తాము ప్రకటించిన క్రీడాభిరామపీఠికయం దీసందేహమును వారే తీర్చివైచిరి. "అప్పకవి శ్రీ నాథుని వీథినాటకములోనివని యుదాహరించిన రెండుపద్యములను చిత్రకవిపెద్దన వల్లభరాయని వీథినాటకములోనివనియె యుదాహరించెను." పుట (ii) "చిత్రకవిపెద్దన, ముద్దరాజు రామన, శ్రీధరుఁడు, గణపవరపు వేంకటకవి, జగన్నాథుఁడు వీరందఱును వల్లభరాయని వీథినాటకములోనివనియె యుదాహరించి యున్నారు." పుట (v) సీతారామాచార్యులు వారు శబ్దరత్నాకరమున ననేకదోషములు గూర్చిరి. అది యట్లుండ నప్పకవీయప్రతులలోఁ దక్కఁ దక్కిన లాక్షణికులు-అనఁగాఁ జిత్రకవిపెద్దన, రామన గణపవరపు వేంకటకవి కూచిమంచి తిమ్మకవి, కిడాంబి వేంకటాచార్యుఁడు లింగమగుంట తిమ్మకవి, కస్తూరి రంగకవి లక్షణదీపికాలక్షణసారగ్రంథకర్తలు "కుసుమం బెట్టిన" యనియే యుదాహరించిరి. చిత్రకవిపెద్దన "పస నెవ్వాఁడు" అను

టకు "అప్పసమెవ్వాఁడు" అని వ్రాసి యప్పసమనుటకు నాశ్చర్యమర్థమని యిది దేశ్యపదమని వ్రాసియున్నాఁడు (viii)

ఇంత కంటెఁ క్తిగ నొకచో లక్షణసారసంగ్రహగ్రంథమును వేఱొకచోఁ జిత్రకవిపెద్దనను బేర్కొతడవ లుదాహరించుటయేగాక చిత్రకవి పెద్దనగ్రంథమునఁగల పాఠభేదమునుఁగూడ శ్రీ కవిగా రిచ్చియుండుటచే లక్ష్యములు గలిగియున్న చిత్రకవిపెద్దన లక్షణసారసంగ్రహము వారు చూచినట్లు నిర్వివాదముగా నేర్పడుచున్నది. అట్టిగ్రంథ మున్నచో దానిని యాంధ్రసాహిత్యపరిషత్తువారి కొసఁగి శ్రీ కవిగారు వాఙ్మయజిజ్ఞాసువులగు మాబోంట్లకు నుత్సాహము గలిగింతురుగాక !

లక్షణసారసంగ్రహమునకును అప్పకవీయమునకుఁగల సంబంధముఁగూర్చి వివరించినచో నప్పకవీయమునకు లక్షణసారసంగ్రహమెంత వఱకు మూలమైనదో తెలిసికొనవచ్చును.

1. కాలక్రమము ననుసరించి చూచినయెడల నప్పకవికంటె చిత్రకవి పెద్దన పూర్వుఁడుకావున నాతనిగ్రంథము నప్పకవి తొలుత గ్రంథావతారికయందుఁ బేర్కొనినాఁడు. పుట 12.

2. ద్వితీయాశ్వాసమున రేఫాక్షరసీసమాలికయందు "తాళ్ల పాకాన్వయోదధిపూర్ణ ధవళదీధితి వేదతిరుమలదేశికుండు, మొదలైనవారలు మునుపు రచించినయవి మెల్లఁజాలవా యనఁగవలదు."

పైనిఁజెప్పిన 'మొదలైనవానిలోఁజిత్రకవిపెద్దన యొకఁడు. లక్షణసారసంగ్రహము తృతీయాశ్వాసమున రేఫఱకారనిర్ణయము గలదు. అందలి సీసగీతములలోనున్న పదములపట్టికనే యప్పకవి కొలఁదిమార్పులతోఁ దనగ్రంథమున గ్రహించియున్నాఁడు. ల. సా. సం. పుట 83-93 అప్పకవీయము. 69-83.

3. తృతీయాశ్వాసమున యతులనుఁగూర్చి వివరించుసందర్భమున. కం. భీమన పదిచెప్పె ననం

తామాత్యుఁడు చేసె వెనుక యతు లిరువదినా

ల్గామీఁదఁ గొందఱు కవి

గ్రామణు లిరువదియునేడు గావించి రొగిన్.

లక్షణసారసంగ్రహమున,

“యతులు గీతితారావళిఁ జేతుఁ గృతుల లాక్షిణికులు మెచ్చ” నని యిరువదియేడు గీతములలో నిరువదియేడు యతులనిచ్చియుండుటచే నప్పకవి సూచించిన లాక్షిణికుఁ డీతఁడే యగునుగదా ! మఱియు రెండు పద్యములఁగూడ నుదాహరించియున్నాఁడు. చూ. దేశీయవిరతి- 19. ఎక్కటివడి. 26.

4. ఉదాహరణకావ్యలక్షణమునకు లక్ష్యముగా నప్పకవి శ్రీకృష్ణోదాహరణమును రచియించియున్నాఁడు. చిత్రకవిపెద్దన హనుమద్భక్తుఁడుగాన హనుమోదాహరణము రచియించియున్నాఁడు. అందీక్రింది పద్యము లక్షణసారసంగ్రహములోనిది కొలఁదిమార్పులతో నప్పకవీయమున నున్నది.

చూడుఁడు. అప్పకవి: —

1. చ. మానవులార ! రోగములు మానును లేములు లేవు సంపదల్
జానగు దుఃఖముల్దొలఁగు జాఱునఘంబులు మందబుద్ధులై
దీనత నొందనేటికి నతిస్థిరభక్తిని గొల్వుఁడీ పరా
ధీనులుగాక మీరు వసుదేవకుమారకు*ముక్తికోసమై. అ. 4–314

పెద్దన:—

చ. మానును రోగము ల్వెతలుమానును లేములు మాను మీకు నో
మానవులార ! యూరక భ్రమంగొన నేటికి నన్యదేవతా
ధీనులుగాక యెప్పుడు నతిస్థిరభక్తి దలిర్పఁ గొల్వుఁడీ
మానినుతప్రసిద్ధమతిమంతుని మాహనుమంతుని న్మదిన్.

ల. సా. సం. పుట. 68.

---

*‘కుమారుని’ యని యుండఁదగును. లేనిచో ద్వితీయావిభక్తి ప్రత్యయము లేదు. పద్యము ద్వితీయావిభక్తిలోనిది.

అప్పకవి:—

ఉ. పులసిలనేల మానవులపుట్టును పావనమౌను నెప్పుడున్
గళవళమేల రోగము లకాలగతిం గడవట్టు నీతిబా
ధలును దరిద్రతావ్యథలు దవ్వులకే చను వాంఛితార్థముల్
గలుగు నమేయుచేతఁ గమలాధవుచే వటపత్రశాయిచేన్.

ఆ.-4-317.

పెద్దన:—

చ. భవహరమౌను పుట్టువును పావన మౌను దరిద్రతావ్యథా
నివహము లన్నియుం దొలఁగు నెమ్మది నెవ్వనిపుణ్యసత్కథల్
చెవులను విన్నవారలకు శీఘ్రమె చేకుఱు నట్టి యాజిసం
భవహతదాసుచేత హనుమత్ప్రభుచేత నభీప్సితార్థముల్.

అప్పకవి:—

చ. గృహోర్వీకృత్తన ద్విధిఁ బెండ్లాడిన కృష్ణునందు నిలిచెన్ దీర్ఘప్రతాపోన్నతుల్.

పెద్దన:—

బృందారాహితపాదు నందు నిలిచెఁ శ్రీమత్ప్రతాపోన్నతుల్.

ఇట్లే యక్షగానలక్షణము మొదలగువానియందుఁ బదములు మార్పులేక కానవచ్చుచున్నయవి. షట్ప్రత్యయవిధానము నప్పకవి విపులీకరించుటకుఁ బూర్వమే పెద్దన దీనిని సూక్ష్మముగఁ దన గ్రంథమునఁ జెప్పినాఁడు. చిత్రకవిత్వమునఁ గల్పితకల్పవల్లికాబంధమున కసమాన చాతుర్యమును జూపి పెద్దన 'చిత్రకవి' యని పేర్వడసినాఁడు. అప్పకవి రచియించిన కల్పితకల్పవల్లి పెద్దనవ్రాసినదానికి ప్రతిబింబ మనఁదగి యున్నది. పై విషయములు సావధానముగఁ బరిశీలించినచో నప్పకవి పెద్దనగ్రంథమును జాలవఱకు మూలముగ నుపయోగించినవాఁడని తెలియఁదగియున్నది.

లక్షణసారసంగ్రహ మప్పకవికాలమునాఁటికే మిక్కిలి ప్రసిద్ధిఁ జెందినట్లువంశపారంపర్యముగ ననంతకవియు, వేంకటరమణకవియు నిట్లు తమ గ్రంథములలోఁ జెప్పియున్నారు.

"లక్షణసారసంగ్రహం బొనరించి యుద్యత్కీర్తిఁ బ్రఖ్యాతుఁడగు
పెద్దనార్యసుతుఁడ
కుమారుఁడు అనంతకవి హరిశ్చంద్రనళోపాఖ్యావ్యాఖ్యాది

"సర్వలక్షణసారసంగ్రహం బొనరించి తనరె మాతాత పెద్దనకవీం
ద్రుఁడు
మనుమఁడు వేంకటరమణకవి సాంబవిలాసకృత్యాది.

మఱియు గద్యయందు 'లక్షణసారసంగ్రహరచనావిశారద చిత్రకవిపెద్దనార్యపౌత్ర' అని వ్రాసికొనినాఁడు.

ఇట్లు వంశీయులేగాక, కొలూరి యాంజనేయకవి తన సుకవికర్ణామృతమునను, పొత్తపి వేంకటరమణకవి తన లక్షణశిరోమణియందును నీగ్రంథము నుదాహరించియున్నారు* వీ రప్పకవికి సమకాలికులు కావున యప్పకవినాఁటికే లక్షణసారసంగ్రహము జాల ప్రఖ్యాతమై యుండె ననియు, నప్పకవిగ్రంథమునకు మూలమైయుండుననియు నూహించుట సమంజసమైయున్నది.

పెద్దన లక్షణసారసంగ్రహమున నాటకలక్షణము దశరూపకము ననుసరించినట్లు వ్రాసినను నుపరూపకముల వివరణముపట్టున సాహిత్యదర్పణము ననుసరించినట్లు కానఁబడుచున్నది. ఇందలి విషయములను విపులముగా వ్రాయవలెననిన నీక్రిందిరీతిని సూచించునట్లు దశరూపకభేదంబులవలె నుపరూపకములకుఁ జేయవలయును. అప్పుడు విద్యార్థులకుఁగూడ నీవిషయము కరతలామలకముగాఁ గలదు.

---

*చూ. పరిషత్పుస్తక భాండాగారము. పుటలు 4-11. ఆం. సా. పరిషత్పత్త్రిక (పరీధావి మార్గశిర- ఫాల్గున) సం. పు. 28. సంచిక 5, 6.

దశరూపక భేదంబులు.

రూపకభేదము.	ఇతివృత్తము.	నాయకుఁడు.	రసము.
1. నాటకము	ప్రఖ్యాతము	ధీరోదాత్తుఁడు	శృంగారవీరరసములు
2. ప్రకరణము	ఉత్పాద్యము	ధీరశాంతుఁడు	శృంగారము
3. భాణము	,,	ధూర్తవిటనాయకుఁడు	శృంగారవీరములసూచన మాత్రము
4. ప్రహసనము	కల్ప్యము	పాషండుఁడు	హాస్యరసము
5. డిమము	ప్రఖ్యాతము	ధీరోద్ధతుఁడు (దేవగంధర్వ రాక్షసపిశాచాదులు)(16)	రౌద్రము
6. వ్యాయోగము	,,	ధీరోద్ధతుఁడు	వీరము
7. సమవాకారము	కల్పితము	దేవాసురనాయకులు (12)	,,
8. వీథి	,,	ధీరోద్ధతనాయకుఁడు	శృంగారరసము
9. అంకము	ప్రఖ్యాతము	ప్రాకృతజననాయకుఁడు	కరుణరసము
10. ఈహామృగము	మిశ్రము	ధీరోదాత్తుఁడు	శృంగారరసము

నాటకలక్షణమే తమగ్రంథములఁ దడవని యాంధ్రలాక్షణికులలో నాటకలక్షణము రచించి యాంధ్రభాషావాఙ్మయమున కుపకృతిగావించినగౌరవము పెద్దనదేయని చెప్పనొప్పను.

పెద్దన హనుమద్భక్తుఁడుగావున హనుమంతునిఁగూర్చి యాతఁడు వ్రాసిన యుదాహరణమున నాతనికవిత యెంతయు హృద్యమైయున్నది. సర్వలక్షణసారసంగ్రహమగు నీగ్రంథము నాంధ్రమహాజను లాదరింతురుగాత !

నిడుదవోలు వేంకటరావు బి. ఏ.

నరసభూపాలీయకర్త మూర్తికవి యనిశనిసము కాలికుఁడు. పెద్దన తనగ్రంథమున నాటకలక్షణముల నిచ్చియుండుటచే నరసభూపాలీయమున నాటకలక్షణము చేర్పఁబడి యుండలేదేమోయను నూహ పొడముచున్నది. ఈవిషయ మింకను బరిశోధింపఁదగి యున్నది.

శ్రీరస్తు.

లక్షణసారసంగ్రహము.

విషయసూచిక.

ప్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము.

క. ఏగణముఁ గదిసె నగణం
బాగణము సమస్తమంగళావాప్తంబై
రాగిల్లు వినుము పరుసము
తోఁ గదిసిన పసిఁడిచన్న దూఁకొనుమాక్కిఁక.

ఆంధ్రకవిగజాంకుశే:—

ఆ. వె. పరుసవేదితోడఁ గ(?)దిసిన లోహంబు
జాతరూపమైన చందమునను
సారమైన నగణసంగతిఁ దనకీడు
...మానిద ...గణముమంచిదగును.

ఇట్లు తాఁ జెప్పఁబూనిన విషయమునంతను సంస్కృతభాషయందే చెప్పినాఁడు. ఉపపత్తినిఁ దెలుపు నాంధ్రచ్ఛందోగ్రంథములుకూడఁ జేర్చినాఁడు. ఇం దీతఁడు పేర్కొనిన లక్షణగ్రంథములు- 1 అలంకారసంగ్రహము. 2 సాహిత్యచూడామణి. 3 సాహిత్యరత్నాకరము. 4 సాహిత్యచంద్రోదయము. 5 కవికంఠపాశము. 6 చమత్కారచంద్రిక. 7 కవిరాజగజాంకుశము. 8. శ్రీధరచ్ఛందము. 9 గోకర్ణచ్ఛందము. 10 అథర్వణచ్ఛందము మున్నగునవి.

గ్రంథారంభము:—

ప్రణమ్య విద్వజ్జనపారిజాతమ్
కవీంద్రవిప్రార్చితపాదపంకజమ్
విభుం ప్రభుం విశ్వసృజం మహేశమ్
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్.

అస్య గద్యప్రబంధానామ్ ఛందోలక్షణ నియామక స్యైదా తావ త్ప్రకారః పఠ్యతే.

గ్రంథాంతభాగము:—

ఏషా లక్షణదీపికా విజయతే విద్వజ్జనానందినీ
ఛందోలంకరణాద్యనేకవివిధగ్రంథప్రయోగాన్వితా

గర్వాఖర్వకుతర్కకర్కశకవిగ్రీవాస్పదా సంశ్రిత
వ్యాళీ సత్కవిరాజకల్పలతికా కల్పాంతరస్థాయినీ.

ఇతి నిరంతరవిజితవినతపారిజాత పోతనామాత్యసహజాత చాతుర్యగుణాభిరామశ్రీమదయ్యలుమంత్రిశేఖరగర్భరత్నాకరరాకాసుధాకర గౌరనార్యవిరచితాయాం లక్షణదీపికాయాం మాతృకాపూజావిధానం నామ పంచమః పరిచ్ఛేదః.

ఇం దుదాహరించిన విషయములనే వివరించుచు నింతకంటె నధికముగఁజాటుప్రబంధలక్షణములఁ దెలుపునట్టి "గౌరన-లక్షణదీపిక"యను పేర వెలయు వేఱొకసంస్కృతలక్షణగ్రంథము 2585 సంఖ్యగలది కలదు. ఈలక్షణదీపికల రెండింటిని రచియించిన గౌరన లొక్కరేనా ? లేక భిన్నులా ? 'నవనాథచరిత్రము' మున్నగు ద్విపదకావ్యములను రచించిన గౌరనకు నీలక్షణగ్రంథమును రచించిన గౌరనకు సంబంధ మేమేని గలదా ? అను నీవిషయము సంశయగ్రస్తముగ నున్నది. విమర్శకు లీయుభయవిధగ్రంథములఁ బరిశోధించి నిర్ణయించెదరుగాక !

10. లక్షణగ్రంథము—గ్రం॥ సం॥ 3488.

ఇందు 48 పత్రములు కలవు. ఆద్యంతభాగములు లేవు. గ్రంథమును రచియించినకవిపేరు కానరాదు. వ్రాఁత బాగుగనే యున్నది. గ్రంథపాతము లేదు. సంధిలక్షణముతోఁ ప్రారంభమై విభక్తులు యతిప్రాసములు మున్నగు కొన్నివిషయము లిందుఁ జర్చింపఁబడినవి. కొన్నితావుల లక్షణములు వానివివరణములు సంస్కృతభాషలో రచింపఁబడినవి. లక్ష్యములు ప్రాచీనప్రబంధములనుండి విపులముగఁ గైకొనఁబడినవి.

గ్రంథారంభము:—

అథసంధిః:—

ఉతోఽచి పరరూపం—సూత్రః=ఉకారమునకు అచ్చుపరముగాఁగా బరరూపము వచ్చును. తాను+అన్న, ఇతి స్థితే నకారాత్పరమైన

ఉకారమునకుఁ బరమం దకారము వచ్చును. తానన్నమాట—తాను + ఇచ్చె తానిచ్చె. తాను + ఈఁదెె=తానీఁదె.

గ్రంథాంతభాగము:—వృత్తసంఖ్యాప్రత్యయము.

క. సమవృత్తప్రస్తార
 క్రమ మిదియును యుక్తి మొదలుగా నెన్నఁ ఛం
 దము వలయు నన్ని గురువులు
 కమలాప్రియ యడ్డచాలుగా నిడి పిదపన్.

పిమ్మటఁ బ్రస్తారపటమును నింక నిరూపింపఁబడినది.

11 కావ్యచింతామణి-గ్రం. సం. 4532.

ఈప్రతి 45 పత్రములు కలది. వ్రాఁత యున్నంతదనుక బాగుగ నే యున్నది. తొలుతఁ బందొమ్మిది పత్రములలో వెల్లంకి తాతమభట్ట ప్రణీతంబైన కావ్యచింతామణి కలదు. ఇదియు నసంపూర్ణమే. 391 సంఖ్యగల ప్రతిలో నీగ్రంథమే 'కవిచింతామణి' యను "కావ్యానుశాసనము" అనుపేర వ్యవహరింపఁబడినది. రెండిట లక్ష్యలక్షణస్వరూప మొక్కటియే. అచ్చటచ్చటఁ గొలఁదిగ మార్పులుగలవు.

గ్రంథారంభము:—

శా. శ్రీభూతేశ సుతాగ్రజున్ గణపతిన్ సీతాంశుమౌళిన్, సమ
 స్తాభీష్టప్రదు, నిర్వికల్పు, జగదాధారున్ ... ...
 ... ...ఫ్రిఁకదమ్మ్యవరున్
 సాభిప్రాయము చేసుతిన్ గొలిచెదన్ సువ్యక్తపూజాపరున్.

సీ. శుచి యజ్ఞమాగర్భశుక్తిముక్తామణి
 యబ్బధీమణిహూనుఁ డనఘబుద్ధి
 పావన వశిత శాలావతగోత్రుఁడ
 హా...సురామార్యతమ్ముఁ

దక్షభాషాప్రక్రియాలబ్ధవర్ణుండు
సన్నుతసాహిత్య చక్రవర్తి
అనవద్య సర్వవిద్యాపారదృశ్వుఁడు
విద్వజ్జన ప్రాతవిశ్రుతుండు

గీ. సకల హరిదంతరాళవిశ్రాంత విశద
కార్తికీక చంద్రికాయతకాంతికీర్తి
హరిహరయాస్యుఁడు వాణీవిహారవసతి
తామసోల్లంఘి వెల్లంకి తాతసుకవి.

క. చేకొని పదరూపంబులు
ప్రాకృతలంకేశ్వరాది బహుశాస్త్రగతిన్
లోకమునఁ దెలియఁ జెప్పఁగఁ
జేకుఱు నాచేతఁ దగు నశేషమునైనన్

తరువాతి పదునేడు పత్రములలోఁ గేతనవిరచితమగు నాంధ్రభాషాభూషణమును, బిమ్మట తొమ్మిది పత్రములలో నర్థములతోఁగూడిన చాటువులును గలవు.

12 లక్షణగ్రంథము-గ్రం॥సం॥ 391.

ఇదియొక సంకలితలక్షణగ్రంథము. ఇందు 130 పత్రములు గలవు. వ్రాఁత బాగుగనేయున్నది. 60 పత్రముల వఱకు శైథిల్యత లేదు గాని, తరువాతి పత్రములు మధ్యభాగమునఁ గ్రిమిదష్టములైనవి. ఇందలి గ్రంథముల వివరము:—

తొలుత నిరువదిమూఁడు పత్రములు-ఆంధ్రనామసంగ్రహము-పిమ్మటఁ బదునేను పత్రములు-ఆంధ్రభాషాభూషణము-తరువాత నిరువదిరెండు పత్రములు-అనంతునిఛందస్సు-ఆవెనుకఁ బదునొకండు పత్రములు దేశితెనుఁగు మాటఁగులు- అనంతరము తొమ్మిది పత్రములు నానార్థనిఘంటువు- పదపడి మూఁడున్నర పత్రములు పెద్దపూడి భద్రన రేఫఱ

కారనిర్ణయము-తుదిని వెల్లంకి తాతంభట్ట విరచితంబైన "కవిచింతామణి" యను కావ్యానుశాసనము నిరువదియేడు పత్రములలో నిమిడియున్నది. ఇందలి తొలిపత్రము కానరాదు.

గ్రంథారంభము:—

క. కృతవతు కృగ్రేయునులకు (?)
 నవిరత మేకాక్ష రాద్యయములకు మఱియున్
 వివరింతు తిజ స్తములకు
 భువిలో ముఖ్యప్రయోగములు లేవు హరీ!

ఇందలి ప్రకరణముల 'నధికారములు' గంబేర్కొనినాఁడు. ఆయాయధికారముల తుదిని వ్రాసిన గద్యములను బట్టి యీకవికిఁ గల ప్రతిభావిశేషమును, ఇందు నిరూపించిన లక్ష్యలక్షణస్వరూపమును దెలియవచ్చుచున్నవి.

(1) ఇది వినుత విద్యావిశారద వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన కావ్యచింతామణి కావ్యానుశాసనంబున దోషాధికారము—
(2) ఇది అష్టభాషావతార వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన కవిచింతామణియను కావ్యానుశాసనంబునందు భాషాలక్షణాధికారము—
(3) ఇది సారసాహిత్యచతుర........................ప్రాసాధికారము—
(3) ఇది ....వర్ణనీయాధికారము.

ఇందు, పావులూరి మల్లన గణితము భాస్కరరామాయణము, అనంతుని ఛందము, మున్నగు గ్రంథములనుండి లక్ష్యలక్షణములు కైకొనఁబడినవి—

గ్రంథాంతము:—

క. వదలక యర్థముఖంబులు
 పదునెనిమిది జగతిఁగలదు పాపాధికముల్
 మదివాని నెఱిఁగి కబ్బము
 పదిలముగాఁ జెప్పవలయుఁ బ్రఖ్యాతముగన్.

క. వద దండి కామనాథిక
విదితాలంకారశాస్త్రవిశదములగు న
ర్వది దోషంబులలో కిం
చిదకంబులు (?) మాని కొన్ని చెప్పితిఁ దెలియన్.

ఇది వినుతవిద్యావిశారద వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన కవిచింతామణికావ్యానుశాసనంబున దోషాధికారము.

13. లక్షణగ్రంథము గ్రం. సం. 580

ఇది యొక సంకలితలక్షణగ్రంథము. ఇందు 37 ముప్పదియేడు పత్రములుగలవు. ఉన్నంతదనుక గ్రంథపాతము లేదు. వ్రాఁత తిన్ననిది. తప్పులు మెండు. తొలుత నిరువదిరెండు పత్రములవఱకు ఆంధ్రనామసంగ్రహము గలదు. తరువాతి పదిపత్రములలో 'లక్షణము'అను పేర వృత్తములుయతులును లక్ష్యలక్షణములతోఁ గూర్పఁబడినవి. కవిపేరు తెలియరాదు. లక్షణములు కవిజనాశ్రయము మున్నగువానిలోనివి. ఇందుఁ జేర్పఁబడినయతులు.

1. స్వరయతి, 2. వర్గయతి, 3. అఖండయతి. 4. ప్రాదియతి, 5. బిందుయతి, 6. ప్లుతయతి, 7. ప్రయుక్తాక్షరయతి, 8. యుక్కటి యతి, 9. పోలికయతి, 10. సరసయతి.

గ్రంథారంభము:-

సర్వగురు ర్మగణం ఆదిగురు ర్భగణం మధ్యగురు ర్జగణం

గ్రంథాంతము:-

సగణలఘు క్రియాంక సమచక్రమునం దొకటాదిగాఁగ త
ద్విగుణము లడ్డనిడి (?) నడలింపుచు కామగృహాంకసంఖ్యలో
నగితరువాతి యిభ్భు ప్రెతు లొడ్డిలి(?)థోంకమునం సమాధికం
జగప్రతిమానుచుం కడమ బొల్చు ప్రతుల్ దొరలింపచల్వగున్.

"ఈఛందస్సు సంజ్ఞాలక్షణము వృత్తలక్షణము మాతృకలోనున్నప్రకారం గాను సంపూర్ణముగా దుర్భపెద్దిభొట్లు వ్రాసెను" అని కలదు.

తుది మూఁడుపత్రములలో కవిజనాశ్రయము కొలఁదిగఁ గలదు.

14 కవిసర్పగారుడము. 4950

ఇందు 39 పత్రములు గలవు. వ్రాఁతఁ చక్కనిది. తప్పులు లేవు. ఇది కాచన బసవనచే రచింపఁబడినది. అసంపూర్ణము వ్రాయసగాని పేరు లేదు. లక్షణముల స్వయముగఁ గూర్చి, లక్ష్యముల ననేకప్రబంధముల నుండి సేకరించినాఁడు.

గ్రంథారంభము:—

శా. శ్రీదేవేంద్రుని శాంతు దంతురవిభారింఛోళి పాణింధమా
 ప్రాశాలిస్తమణీ నిలింపమకుట ప్రాసాదఖేలత్పదుం.
 దేశాకల్పుని మల్లికార్జునిని సంప్రీతిం గృతిం జేసి వి
 ద్యాశక్తిం గవిసర్పగారుడము సందర్భింతుఁ బూర్వస్థితిన్.

కావున జగదుపకారంబుగా శారదావిలాసంబును, లక్షణసారంబును, లక్షణదీపికయును, సాహిత్యచూడామణియును, కవికంఠపాశంబును, కవిగజాంకుశంబును, ఉక్తాదిఛందంబుల సంధించి, బంధవిచిత్రసంధాన బంధన గ్రంధం బనవద్యంబుగా సకలలక్షణంబు లీక్షించి, అక్షయాక్షుద్రవై లక్షణ్యంబులగు యక్షరంబులకు వివక్షించెద.

గ్రంథాంతభాగము:—అందు లయవిభాతి యను వృత్తము.

 ననననసనంబులును ననననసగంబులును
 నెసఁగఁ గృతిపాదముల రసికముగఁ జెప్పన్
 కుసుమశరవత్సుభగ యసదృశగుణానుయుత
 వెస లయవిభాతి యని రసమనుకవీంద్రుల్.

15. కవిసర్పగారుడము. 3575

ఇది 28 కొండపల్లి పీచుకాగితపుఁబత్రములతోఁ గూడినది. వ్రాఁత కన్నడమోడీలో నున్నది. తప్పు లంతగ లేవు. పత్రము లచ్చట

చ్చటఁ గ్రిమిదష్టములైనను గ్రంథపాతము మాత్రము లేదు. 4950 ప్రతిలోని విషయము, నిందలి విషయము నొక్కటియే. అచ్చటచ్చటఁ గొలఁది మార్పులు గలవు. గ్రంథారంభమునందలి తొలిపద్యము లిందు లేవు.

గ్రంథారంభము:—

కావున జగదుపకారంబుగా శారదాతిలకంబును. వాతూలంబును అక్షరాక్షరద్వైలక్షణ్యం బమరవీక్షించి, గణంబులకు నుత్పత్తియు, ఫలంబులును, యోనులును, నక్షత్రంబులును, వర్ణంబులును, గ్రహంబులును, కులంబులును, రసంబులును, గణంబులును, అధిదేవతలును, గ్రంథాంతరంబుల ప్రయోగవిధంబు, సహజప్రయోగలక్షణంబు, తత్తద్వ్యాఖ్యానంబులు, ఫలంబులు, కులంబులు, గ్రహంబులు వర్ణంబులును, నధిదేవతలు, భూతబీజ ప్రకారంబులు, రాసులు నక్షత్రంబులు యోనులు, తత్తద్వ్యాఖ్యానంబులు, గ్రంథాంతర సమ్మతులు, ప్రయోగలక్షణంబులు, మిత్రామిత్రశోధనక్రమంబులు, వేధావేధలక్షణంబులు, ప్రయోగవేళలు, స్వరంబులు, గతులు, దిక్కులు, గంధపుష్పధూపదీపోపహారంబులు, పూజాక్రమంబులు, ప్రస్తారముఖమత్ప్రత్యయంబులు, నుదాహరణభేదంబులు, శృంగారాది రసభావంబులు, మదనసాధనంబు లెఱింగించెద.

కాచన బసవన యీగ్రంథమును రచియించినాఁడని తెలుపు నాశ్వాసాంతగద్యము.

ఇతి శ్రీమన్నందవరకులకలశ పారావారాత్రేయసగోత్ర పవిత్ర సుజనవిధేయ కుకవికార్ద్రివేయునైన తేయు కాచన బసవన నామధేయ ప్రోక్త శ్రీ గిరిమల్లికార్జుననామధేయాంకితంబైన కవిసర్పగారుడంబున గణాక్షరఫలంబన్నది ప్రథమాశ్వాసము.

యతుల యుదాహరణములతో నీప్రతి ముగిసిపోయినది. ప్రతి తుదిని సముద్రాల కృష్ణమయ్య వ్రాసినదిగాఁ దెలియుచున్నది.

డింగితజ్ఞుఁడు రాముఁ డంగజాతహ రాంఘ్రి
సంగమానసుని బతంగతేజ
మంగళాచారు విహంగమరాజతు
రంగసన్నిభుఁ గౌశికుం గనుఁగొని

గీ. గంగసత్కథ నీవు చెప్పంగ వింటి
కొంగున ముడుచు బంగారుభంగి నొప్పు
తుంగసుకృతంబు కాంతు దీరంగఁ గలిగె
సంగతానంద ! నిన్ను మెచ్చంగ వశమె ? ౧౬౭

చ. అన విని సంతసించుచుఁ గుశాన్వయుఁ డజ్జనపాలనందనుం
గనుఁగొని పల్కె బాహుబలఖండితదానవవీర రాఘవా!
వనజహితుండు గ్రుంకెఁ గనవచ్చెఁ దమిస్రము దిక్కులందు నిం
క ననుజుఁ డీవునున్ సుఖముగా శయనింపుఁడు నాదుసన్నిధిన్. ౧౬౮

క. అని పల్క రామలక్ష్మణు
లనురాగముతోడ మునిజనాధ్యుసవిధం
బునఁ దృణవిరచితశయ్యల
ననువుగ నిద్రింపఁగా నిశాంతం బగుటన్ ౧౬౯

గీ అపుడు పౌలోమి తనపట్టి యాడుకొనఁగఁ
దలఁచి తత్తల్పమున కూర్ధ్వతలమునందు
వ్రేలఁగట్టిన బలుమగజాలబంతి
విధము దోఁపంగ దివిఁ దోఁచె వేఁగుజుక్క. ౧౭౦

గీ. జక్కవలవిందు పొడము ప్రాగ్దిక్కునందు
మ్రొక్కుఁడని తెల్పుచుండె నాఁ గుక్కుటములు
రెక్క లల్లార్చి కంఠముల్ నిక్కఁజేసి
కుక్కురో కో యటంచును గూయ సాఁగె. ౧౭౧

వ. ఆసమయంబున రామలక్ష్మణులు మేల్కాంచి సూర్యోదయావసరంబునం బ్రాతరాహ్నికకృత్యంబుల నిర్వర్తించి సకలమునిజనంబులకు

నమస్కరించి, కౌశికసమేతులై యచ్చోటు నిర్గమించి, పరిపూరిత భక్తమనోరథయగు భాగీరథి నుత్తరించి, యవ్వలితీరంబునఁ బ్రవేశించి, యాసమీపంబునందు కరితురగాందోళికాదివిరాజితంబును, ధనధాన్యసంపన్నంబును, నిరంతరజనసంకులంబును, మణిగణఖచితగోపురంబును, నగు విశాలాపురంబుం గాంచి, తద్విలాసంబునకు హర్షించి, విశ్వామిత్రుంజూచి, యిన్నగరం బెవ్వరి దెఱింగింపుం డనిన, రామచంద్రునకుఁ గౌశికుం డిట్లనియె. ౧౭౨

సీ. విను రామ! తొల్లింటి వృత్తాంత మంతయు
 వినిపింతు నెమ్మది వేడు కలర
బలవంతులగు నిర్జరులు దితినందనుల్
 దమలోన నమృతంబు ద్రావఁ గోరి
వరమందరాద్రిఁ గవ్వంబుఁ గావించియు
 నురగేంద్రుఁ ద్రాడుగా గిరికిఁ బన్ని
క్షీరసాగరము దుర్వారులై దరువంగ
 నబ్ధిఘోషములు బ్రహ్మాండ మెల్ల
గీ. నిండెఁ; నంతట దుగ్ధవార్నిధిని దివ్య
తనుఁడు దివ్యకమండలుధారి యగుచుఁ
బుట్టె ధన్వంతరి యనంగఁ బురుషవరుఁడు
దిశలఁ దనమేనికాంతులు దీటుకొనఁగ. ౧౭౩

వ. మఱియును. ౧౭౪

క. అచ్చుగ నమరులు దనుజులు
మచ్చిక లొదవంగ కడలి మథియింపంగా
నచ్చర లఱువదికోటులు
చెచ్చెర జనియించి రందు సితకమలాక్షా! ౧౭౫

వ. మఱియు నప్పాలవెల్లియందు 'వారుణి' యను సురయును, 'ఉచ్చైశ్శ్రవం' బను హయంబును, 'ఐరావతం' బను గజంబును, కమలాదేవి

యు, కౌస్తుభరత్నంబును, కల్పవృక్షంబు నాదిగా ననేకంబు లుద్భ
వించినవెనుక నమృతం బొదవిన నయ్యమృతంబునకై దేవదానవులు
కలహించుచుండ నాసమయంబున విష్ణుండు జగన్మోహినియై, తన
మాయాప్రభావంబున దైత్యసమూహంబు మోహితంబు గావించి,
యమృతం బపహరించె; నది కారణంబుగా సురాసురుల కధికసంగ్రా
మంబు వర్తించె. నందు నసురుల వధించి విజయంబు చేకొని, సురస
హితుండై యింద్రుండు సురలోకంబున కరిగి లోకత్రయం బేలుచు
సుఖంబుండె; ననంతరంబ. ౧౭౬

క. అమృతనిమిత్తంబున న
య్యమరులకును రక్కసులకు నధికము గాఁగన్
సమరం బగుటయు దానన్
విమతులచే సుతులు దెగుట విని దితి మదిలోన్. ౧౭౭

సీ. తద్దయు శోకించి తనవిభుఁ గశ్యప
మునివరుఁ గనుఁగొని వినతిఁ జేసి
యనఘాత్మ ! సురలు మదాత్మజాతుల నెల్లఁ
దునుమాడి రాజిలో దోర్బలమున
నసుతనై యాత్మలో నలమట నందుచు
నుంటిఁ గావున నాకు నురుబలుండు
పురుహూతహరుఁడగు పుత్రుండు గలుగంగఁ
గరుణింపవలయు శీఘ్రమున దేవ !

గీ. యనుడుఁ దనసతి దితిఁ గాంచి మునివరుండు
భూరికారుణ్యపీయూషపూరితాత్ముఁ
డగుచుఁ గోమలి నీవు నన్నడిగి నట్ల
సేమ మొనరింతు నెమ్మదిఁ జింత విడువు. ౧౭౮

క. తరుణీ వేవత్సరములు
నిరుపమశౌర్యమునఁ దపము నీ వొనరింపన్

గురుతరబలుఁడు పురందర
హరుఁడగు తనయుండు నీకు నరుదుగఁ బుట్టున్. ౧౭౯

క. అని యంగమార్జనముఁ గై
కొనఁ జేసి మునీంద్రుఁ డేఁగె గురుతరతప మే
పునఁ జేయఁగఁ గశ్యపుఁ డిటు
చన దితి కడునిష్ఠఁ దపము సలుపఁగఁ దొడఁగెన్. ౧౮౦

గీ. దితి తపము సేయుచుండుటఁ దెలిసి యాత్మ
కదలి సురలోకనాయకుం డరుగుదెంచి
ఫలజలాదు లొసంగుచుఁ బరమభక్తి
సవతితల్లికి శుశ్రూష సలుపుచుండె. ౧౮౧

వ. ఇట్లు సంక్రందనుండు సవిత్రికి సవినయంబుగా సపర్య లాచరించు
చుండఁ బదివత్సరంబులు గొఱంతగా సహస్రవర్షంబులు నిండుటయు,
నొక్కనాఁ డపరాహ్ణసమయంబున శిరోభాగంబు చరణప్రదేశంబుగా
విస్రస్తకేశపాశయై దితి నిద్రించుచుండిన, ౧౮౨

గీ. అశుచియైయుండె దితి యిది యవసరంబ
టంచు దితి బొజ్జలోఁ బ్రవేశించి యాత్మ
కరకలితవజ్రధారఁ దద్గర్భ మేకు
ఖండములు గాఁగఁ గోసె నాఖండలుండు. ౧౮3

గీ. కోయునెడ బాధ కోర్వక కుక్షి నున్న
శిశువు రోదింపఁగా సునాశీరుఁ డుల్ల
మలర 'మారుద' 'మారుద' యనుచుఁ గోయ
మిట్టిపడి లేచి యా సాధ్వి యిట్టు లనియె. ౧౮౪

క. తెగటార్పకు దెగటార్పకు
తగ వెడలు మటన్న దేవతానాయకుఁ డా
ప్పుగ వెడలి వినయమొప్పఁగ
నగవడి కేల్మొగిచి యిట్టు లనియెన్ భక్తిన్. ౧౮౫

శా. తల్లీ! నీ వశుఁచిత్వ మొప్పఁ గడు నిద్రం జెందియుండంగ నే
నుల్లంబం దిది వేళయంచు దళనోద్యోగంబు గావించితిన్,
తల్లోక్యం బాచరింపకున్న సుతు డుద్యల్లీల నీకబ్బువాఁ
డుల్లాసంబున నన్నుఁ ద్రుంచు ననిలో నుగ్రక్రియారంభుఁడై. ౧౮౬

క. నీ వెఱుఁగవె యీ చందము
దేవీ నీసుతుఁడు నన్నుఁ దెగటార్పంగా
భావుకమె నీకు మదిలో
భావింపుము నేను నీదుపట్టిని గానే. ౧౮౭

ఆ. వె. కాన నీవు నన్ను గరుణఁ బ్రోవు మటంచు
వేల్పుఱేఁడు తన్ను వేఁడుచుండ
సమరవరుఁ డసాధ్యుఁడని దితి శపియింప
లేక మిగుల నుమ్మలించి పలికె. ౧౮౮

క. తనయుండ వినుము నాచే
సిన దుష్కృత మిట్టి కీడుచేసెను నీ వే
మొనరించెదు నీపైఁ గిని
యను నినుఁ బ్రార్థింతు నాస్పృహను గూర్పు మిఁకన్. ౧౮౯

సీ. సుత! భవత్కులిశఖండితగర్భసప్తఖం
డంబులు సతమారుతంబు లగుచు
గగనవాతస్కంధగాములు గానిమ్ము
మఱియును విను మాద్యమారుతంబు
నలువలోకమున రెండవమారుతము సురా
ధీశలోకమునఁ దృతీయమారు
తము గగనంబునం దక్కిన నలుమారు
తములు నల్దిక్కుల నమరమూర్తు
లగుచు నీయాజ్ఞ మెలఁగని మ్మనఘ నీవు
కినుక 'మారుద' 'మారుద' యనుట మాను

తాహ్వయంబులఁ దనరని మ్మనిన వినుచు
నింద్రుఁ డాదైత్యమాతతో నిట్టు లనియె. ౨౯౦

వ. దేవీ నీమనోరథంబు సిద్ధించు, నీకొమరులు సప్తమారుతంబులై దేవ
మూర్తులై సకలలోకంబులయందు సుఖంబునం బ్రవర్తించుచుందురు
సంతోషింపు మని పలికి, యప్పాకశాసనుండు నాకంబున కరిగె,
నిట్లు పుత్రాశంజేసి తపోనియతయైన దితికి శతమఖుండు పరిచర్య
నొనర్చుచుండిన దేశం బిదియని చెప్పి కౌశికుం డిట్లనియె. ౨౯౧

క. జనవల్లభ ! యిక్ష్వాకుని
తనయుండు విశాలుఁ డనఁగఁదగు రా జేలున్
ఘనమగు నీపట్టణ మా
తనిపేర విశాల యనఁగఁ దగు నిప్పురియున్. ౨౯౨

గీ. ఆవిశాలు విశాలాన్వయంబునందు
'సుమతి'యను రాజు జన్మించి సొంపు మిగుల
నీవిశాలాపురం బిప్పు డేలుచుండె
జనపతులు సంతతముఁ దన్ను సన్నుతింప. ౨౯౩

ఉ. చాపకళాధురీణ నవసారసలోచన రామ ! యీవిశా
లాపురి నేఁటిరాత్రి మది లాలస మానఁగఁ బవ్వళించుచున్
రేపు విదేహకుం జని విరించినమున్ జనకక్షితీశ్వరున్
బాపవిహీనుఁ జూత మని పల్కుచుఁ గౌశికుఁ డున్న యత్తఱిన్.

ఆ. వె. మునివరేణ్యురాక వినుచు నాసుమతియు
కరము భక్తి నెదురుగాఁగ నేగి
మ్రొక్కి యర్ఘ్యపాద్యము లొసంగి మన్నించి
కుశల మడిగి కరుణఁ గోరి ప్రోల. ౨౯౪

వ. ఉన్నసమయంబున నమ్మునివరుం డజ్జనవరున కిట్లనియె. ౨౯౫

క. సుమతిగలవాఁడ వగుటను
సుమతి యనెడు పేరు నీకు శోభిలుచుండెన్

సుమతిజనవినుతకీర్తి వ
సుమతిన్ వినుఁబోలు పట్టి సుగుణులు గలరే. ౧౯౭

చ. అని వినయంబునం బలికి, యాతనితమ్ముని రాజు వేడ్క దీ
వనలిడి రామలక్ష్మణుల వార్తలు దెల్పఁగ సన్నరేంద్రుఁ డున్
మనమునఁ బొంగి రాఘవుల మన్ననఁజేయఁగ సత్వరంబుగాఁ
జని, తగ విశ్రమించి రట సంయమియున్ నరనాథసూనులున్ ౧౯౮

క. ఆరాతిరి చన మఱునాఁ
డా రాఘవు లమ్మునీంద్రుఁ డాత్మల ముద మే
పారఁగఁ బ్రభాతకృత్యము
లాహూఢి నొనర్చి మిథిల కరిగిరి సరగన్. ౧౯౯

వ. అప్పు డప్పురోపకంఠంబున నొప్పుచున్న యొక్కయారామంబుఁ గని యారామచంద్రుండు గౌశికమునీంద్రుం గాంచి, మునివరా ! జనర హితంబయ్యు నతిరమణీయంబగు నీయాశ్రమం బెవ్వరి దెఱంగింపవే యని యడిగిన విశ్వామిత్రుం డిట్లనియె. ౨౦౦

ఉ. భూతలనాథ ! రామ ! విను పుణ్యచరిత్రుఁడు భూరితేజుఁ డా
గౌతముఁడన్ తపోధనుఁడు కాంత యహల్యయుఁ దానుఁ గూడి, ము
న్నాతతనిష్ఠ సన్మునిజనాళులు మెచ్చ ననేకవర్షముల్
ప్రీతిఁ దపంబు సేయుచును బెంపువహించుచు నుండ నొక్కడన్.

గీ. అదను వేచి సురేంద్రుఁ డహల్యఁ గవయ
నాత్మఁ దలఁచుచు మదనశరాళిదళిత
హృదయుఁ డగుచును గౌతమాకృతి వహించి
పర్ణశాలఁ బ్రవేశించి పడతిఁ జూచి. ౨౦౨

క. కలకల నవ్వుచు సీతోఁ
గలియఁగ నేతెంచినాఁడఁ గామిని యనినన్
కలవాణి యతనిఁ గనుఁగొని
బలభేదనుఁ డని యెఱింగి పలికెఁ బ్రేమన్. ౨౦౩

ఆ. వె. అమరవిభుఁడ వౌదు వసుధాత్మ నిక్కంబు
తెలుపు నా కటంచుఁ జెలువ పలుక
నమరవిభుఁడఁ గాను యతివ నీ కిప్పుడు
దాఁప నేల యని యతండుఁ బలికె. ౬౦౪

వ. అని పరస్పరంబును మనోరథంబులు తేటపడం జెప్పుకొనుచున్న
యెడ నమరవల్లభుం డహల్య కిట్లనియె. ౬౦౫

క. శాతోదరి! నీకొఱకై
గౌతమవేషంబు పూని కదిసితి నాకున్
జేతోమోదం బొదవఁగ
నీరతి రతికేళిఁ దేల్పు మిందునిభాస్యా! ౬౦౬

క. గద్దరి మదనుం డిటు మన
కిద్దఱకుం ఘటనచేసె నిఁక నీమదిలో
తద్దయుఁ గూరిమి పెనఁగొన
ముద్దియ్యవె నాకుఁ దబిసి ముద్దియ వేగన్. ౬౦౭

సీ. కంజాక్షి! నీచన్నుఁగవ నంటఁ జాలని
కరముల కేమి సౌఖ్యంబు గల్గు
చంద్రాస్య! నీమేనిసొబగు గాంచనియట్టి
కన్నుల కేమి సౌఖ్యంబు గల్గు
పల్లవపాణి! నీ పల్కులు వినని క
ర్ణంబుల కేమి సౌఖ్యంబు గల్గు
కలకంఠి! నీతోడఁ గలిసి యుండనిశరీ
రంబున కేమి సౌఖ్యంబు గల్గు
గీ. నాతి! నీకూర్మి నాకు నీనాఁటి కబ్బెఁ
బడఁతి! నేఁడు త్రిలోకాధిపత్య మబ్బె
నాఁటికంటెను మిగుల నానంద మయ్యె
నెలఁత! నాభాగ్యగరిమ వర్ణింపఁ దరమె. ౬౦౮

గీ. తరుణి నామాట లెల్ల చిత్తమునఁ బూని
నమ్మెదో నమ్మవో సంశయమ్ము గాని
నిన్ను శచికంటె నధికగా నెన్నుచుండుఁ
దెలుపనేటికి నామది దేవుఁ డెఱుఁగు. ౨౦౯

క. ఎవ్వరు గనకుండఁగ నిటు
పువ్వారుంబోఁడి మనకుఁ బొందు ఘటిల్లెన్
పువ్వులకోరివజీరుని
చివ్వకు నీమెచ్చుఁ గొంకు శీతాంశుముఖీ! ౨౧౦

గీ. సకలశాస్త్రార్థవిజ్ఞానచతురుఁ డనుచు
వట్టిమాటలు జగతిలోఁ బుట్టెఁ గాని
స్నానసంధ్యాద్యనుష్ఠాన సరణి యట్ల
కామశాస్త్రార్థ మెఱుఁగునే గౌతముండు. ౨౧౧

గీ. గౌతమునకును నీకు సంఘటన మగుట
వనిత! నీప్రాయ మిన్నాళ్లు వ్యర్థమయ్యె;
నడవిఁ గాచిన చంద్రికయట్ల ధరణిఁ
బాడు గృహమున నున్న దీపంబువోలె. ౨౧౨

గీ. జగతిలోపల నెంత యసాధ్యమైన
తపముచేతను సాధింపఁ దగును; గాన
భామ! నీ వొనరించు తపంబువలన
నింద్ర భోగంబు సమకూరె నింత నిజము. ౨౧౩

క. చిలుకల కొలికీ! మరువిరి
ములుకులగతి నీ కటాక్షములు నామెదపైఁ
బలుమఱు నాటిన తాళం
గలనా? నను నేలు సురతకలనాసక్తిన్. ౨౧౪

మ. లలనా! నీవయిఁ గూర్మిపెంపున మహోల్లాసంబు దీపింపమున్
గలనైన న్నినుఁ గూడి చొక్క మదిలోఁ గాంక్షింతు నల్లైన ను

త్పలపత్రాక్షి! మదంబకంబులను రెప్పల్ మూయ వేనాఁడు; మా
యలదైవంబు కృపావిహీనుఁడయి న న్నస్వప్నునిం జేయుటన్. ౬౧౫

వ. అనుచు నేకాంతంబుగా శచీకాంతుండు కంతుశరకంపితస్వాంతుండై,
తనయభిప్రాయంబంతయు నెఱింగించి వేఁడిన, మునికాంతయగు నహ
ల్య నిరంతరసంతోషభరితాంతఃకరణయై, యావంతైన వింత నొం
దక మంతనంబున నతని కిట్లనియె. ౬౧౬

గీ. అమరవల్లభ! విను త్రిలోకాధిపతివి
నీకృపావీక్షణమునకు నేఁడు తగిన
దాననైతిని; నేఁ జేయు తపము పండె;
నాకలోకైక కోనసాఁగె నాకనిలయ! ౬౧౭

క. వనితలు నన్నుఁ గనుచు మహా
మునిమగువా! యనుచుఁ బిల్వ మోదము గైకొం
దును; శ్రీమంతుని కలికీ!
యనునట్టులు దోఁచు నప్పదార్థమువలనన్. ౬౧౮

క. ఆ యర్థము నిక్కముగా
నాయెడ వర్తించె నిపుడు నాకేశ! త్రిలో
కాయతమానితరాజ్య
శ్రీయుక్తుఁడవైన నీకుఁ జెలినై యుంటన్. ౬౧౯

క. నారూపము నాజవ్వన
మూరయ మునిపత్నినగుట యర్హామై చెపుమా
నీరజగర్భుని వ్రాఁతలు
ధారుణిలో నేరికైనఁ దప్పనె యకటా! ౬౨౦

గీ. పదము లొత్తుచుఁ దనచెద్దఁ బవ్వళింపఁ
బవ్వ మీఁది, నేఁడు వ్రతమని పలుకుఁ గాని
పానివకుఁ డొక్క రేయైనఁ గాని మదన
కదనసుఖ మంద నేరఁడు గదిసి నన్ను. ౬౨౧

క. సతి కెనయగు పతిచే నగు
రతి దలఁపఁగ మిగుల సుఖకరం బగుచుండున్
జతగాని వానిచే నగు
రతి దుఃఖకరంబగు న్సురవ్రజనాథా! ౬౨౨

క. గౌతమముని రూపముచే
నాతో సరియగునె దేవనాయక! విను మ
చ్చాతుర్యవచనరచనల
కాతలసంతోష మంద సర్వుఁడె చెపుమా. ౬౨3

శా. ఆనందంబున నావిభుం గనను పాకారీ! కృపాకారి నీ
గాన న్నేఁడు దురంతచింత లుడిగెన్ గారాము నాకబ్బె నీ
చాన న్నన్ను వరించు కోర్కు లలరన్ సంభోగసంధాయివై
నానాబంధ విచిత్రవై ఖరుల నానందాబ్ధిలోఁ దేల్చుచున్. ౬౨౪

క. శతమన్యుఁడు పతి యని సం
తతఖేదముఁ జెందుచుండ దైవము నాకున్
శతమన్యుని నినుఁ గూరిచి
యతిమోద మొనర్చె నిప్పుఁ డతిచిత్రముగన్. ౬౨౫

గీ. ఇంద్రుఁడ నటంట కైతవం బింతె కాని
దర్పకుఁడ వంచుఁ దోఁచు సౌందర్య మరయ
శంబరారివి సుమనః కదంబకృతివి
హరిహయుఁడ వౌట సందియం బగునె నాకు. ౬౨౬

చ మనమున నిన్నుఁ గోరి, కడు మక్కువతోఁ డుతె నున్న నాపయిన్
ఘనకృప నీవు వచ్చితివి గావున నీకిఁక విన్నవించెదన్
జనవున జాగుసేయక, వెసన్ మదనాశుగపీడ వీడఁగా
నను రతికేళిఁ దేల్చు సురనాయక! మాటలు వేయు నేటికిన్. ౬౨౭

క. అని పల్కు నహాల్యం గని
వినయంబునఁ బలికె దేవ విభుఁ డావనితా!

విను నీ వాడిన మాటలు
ఘనివశీ నాఏరులకును బంధువఁజేసెన్. ౬౨౮

క. తరుణీమణి ! సరసత గల
సరసీరుహనేత్రచెల్మి సంగత మైనన్
బురుషునకు నింతకంటెను
బరమానందకరమైన భాగ్యము గలదే. ౬౨౯

వ. అను సమయంబున, ౬౩౦

క. ఇరువురకు నింత సేపిటు
గురుభృతు లొప్పనె యటంచు గొబ్బునఁ గోపో
ద్ధురుఁడై మదనుఁ డహల్యా
సురపతులన్ దూలనేసె సుమశరములచేన్. ౬౩౧

వ. అంత నయ్యహల్యాకాంతా శచీకాంతులు పరస్పరసంజనిత ప్రేమాతిరేక సంభ్రాంతస్వాంతులై గాఢాలింగనంబు లొనర్చుచు, మధురాధరసుధాపానంబు లాచరించుచు, నఖదంతక్షతంబులు సేయుచు,లపనకపోలచుంబనంబులు గావించుచు సంభోగసమయోచిత మృదుమధురవచనంబు లాడికొనుచు, రతిరహస్యాది మదనశాస్త్రోక్తప్రకారాంగీకృత బహువిధవిచిత్ర బంధబంధుర సురతసంజాతానంద విస్మృతశరీరు లగుచుండి, కొంతసేపునకుఁ దెలివిఁగాంచి, మందహాసభాసుర వదనారవిందులై, కందర్పప్రభావంబునకు విస్మితు లగుచున్నయెడ, రదప్రభావిజితకుందయు, కచనిచయవిజితమిళిందయు, మందగమనపరిహాసితగజబృందయు, పురందర సమాగమకృతానందయు నగు మునిసుందరి సంక్రందనున కిట్లనియె. ౬౩౨

చ. అనిశముఁ దెంపుమీఱుచు మదాత్మనఁ గీల్కొను పంచబాణవే
దన సడలించితీవు కడుధన్యత నొందితి; నింకఁ బాకశా
సన ! నినుఁ బాసి యొక్కనిమిషంబయినన్ నిలుపోవఁజాల నై
నను మదిసాధ్వసం బొకటి నాటుకొ యున్నది; యేమి సేయుదున్.

క. పతి కెనయగు పతిచే నగు
రతి దలఁపఁగ మిగుల సుఖకరం బగుచుండున్
జతగాని వానిచే నగు
రతి దుఃఖకరంబగు న్సురవ్రజనాథా! ౬౨౨

క. గౌతమముని రూపముచే
నాతో సరియగునె దేవనాయక! విను మ
చ్చాతుర్యవచనరచనల
కాతతసంతోష మంద నర్హుఁడె చెపుమా. ౬౨౩

శా. ఆనందంబున నావిభుం గనను పాకారీ! కృపాకారి నిన్
గాన న్నేఁడు దురంతచింత లుడిగెన్ గారాము నాకబ్బె నీ
చాన న్నన్ను వరించు కోర్కులలరన్ సంభోగసంధాయివై
నానాబంధవిచిత్రవైఖరుల నానందాబ్ధిలోఁ దేల్చుచున్. ౬౨౪

క. శతమన్యుఁడు పతి యని సం
తతఖేదముఁ జెందుచుండ దైవము నాకున్
శతమన్యుని నినుఁ గూరిచి
యతిమోద మొనర్చె నిప్పుఁ డతిచిత్రముగన్. ౬౨౫

గీ. ఇంద్రుఁడ నటంట కైతవం బింతె కాని
దర్పకుఁడ వచుఁ దోఁచు సౌందర్య మరయ
శంబరారివి సుమనఃకదంబకృతివి
హరిహయుఁడ వౌట నందియం బగునె నాకు. ౬౨౬

చ. మనమున నిన్నుఁ గోరి, కడు మక్కువతోఁడుత నున్న నాపయిన్
ఘనకృప నీవు వచ్చితివి గావున నీకిఁక విన్నవించెదన్
జనవున జాగుసేయక, వెసన్ మదనాశుగపీడ వీడఁగా
నను రతికేళిఁ దేల్చు సురనాయక! మాటలు వేయు నేటికిన్. ౬౨౭

క. అని పల్కు నహల్యం గని
వినయంబునఁ బలికె దేవవిభుఁ డావనితా!

విను నీ వాడిన మాటలు
ఘనివశి నావీనులకును బొంకువఁజేసెఁ. ౬౨౮

క. తరుణీమణి ! సరసత గల
సరసీరుహనేత్రచెల్మి సంగత మైనన్
బురుషునకు నింతకంటెను
బరమానందకర మైన భాగ్యము గలదే. ౬౨౯

వ. అను సమయంబున, ౬౩౦

క. ఇరువురకు నింత సేపిటు
గురుధృతు లొప్పనె యటంచు గొబ్బునఁ గోపో
ద్ధురుఁడై మదనుఁ డహల్యా
సురపతులన్ దూలనేసె సుమశరములచేన్. ౬౩౧

వ. అంత నయ్యహల్యాకాంతా శచీకాంతులు పరస్పరసంజనిత ప్రేమా
తిరేక సంభ్రాంతస్వాంతులై గాఢాలింగనంబు లొనర్చుచు, మధురా
ధరసుధాపానంబు లాచరించుచు, నఖదంతక్షతంబులు సేయుచు,లపన
కపోలచుంబనంబులు గావించుచు సంభోగసమయోచిత మృదుమధు
రవచనంబు లాడికొనుచు, రతిరహస్యాది మదనశాస్త్రప్రకారాం
గీకృత బహువిధవిచిత్ర బంధబంధుర సురతసంజాతానంద విస్మృతశ
రీరు లగుచుండి, కొంతసేపునకుఁ దెలివిఁగాంచి, మందహాసభాసుర
వదనారవిందులై, కందర్పప్రభావంబునకు విస్మితు లగుచున్నయెడ,
రదప్రభావిజితకుందయు, కచనిచయవిజితమిళిందయు, మందగమన
పరిహసితగజబృందయు, పురందర సమాగమకృతానందయు నగు
మునిసుందరి సంక్రందనున కిట్లనియె. ౬౩౨

చ. అనిశముఁ బెంపుమీఱుచు మదాత్మనఁ గీల్కొను పంచబాణవే
దన సడలించితీవు కడుధన్యత నొందితి; నింకఁ బాకశా
సన ! నినుఁ బాసి యొక్కనిమిషంబుననన్ నిలుపోవఁజాల నై
నను మదిసాధ్వసం బొకటి నాటుకొ యున్నది; యేమి సేయుదున్.

వ. అది యెట్టిదం చేని? యెఱింగించెద నాకర్ణింపుము. ౬౩౪

ఉ. చూతశరాకృతీ! బలనిషూదన! నీవు నేను గూడి యి
ట్లాతతలీల ముచ్చటల నాడుచునుండిన నింతలోపలన్
గౌతమమౌని వచ్చిన సకారణశాపము లిచ్చు నీకు నా
కీతఱి నట్లుగాన దివి కేఁగుము చెచ్చెర నీవు నావుడున్. ౬౩౫

ఉ. కామిని! నాకు నీకయినఁ గల్గిన కూరిమి నిన్ను వీడఁగా
నామదిఁ దోఁపదైన నొకనాఁటికిఁ దీఱునె నాదుమోహ; మో
కోమలి! నీవు చెల్పునటు గొబ్బున నేఁగెద నింటి కాముని
గ్రామణి రాకమున్న ననుఁగన్నసహించునె మౌని శాంతుఁడై ౬౩౬.

ఆ. వె. అతివ! యినుము నంటు నగ్నికి సమ్మెట
పెట్లు దగులునట్ల పేర్మితోడ
నన్నుఁ గదిసియున్న నిన్ను శిక్షించుఁ బో
గౌతముండు కోపకలితుఁ డగుచు ౬౩౭

ఆ. వె. కాన సత్వరంబుగా నింటి కేఁగెద
మగువ నన్ను నెపుడు మఱవకుండు
ముచితమైన వేళ నొగి వత్తు నిటకుమ
త్ప్రాణతుల్య! ఘనకృపా! యహల్య! ౬౩౮

వ అని పల్కి, పునఃపునరాలింగనంబు గావించుచు, ప్రణయమధుర వచనంబు లాడుచుఁ గొంత తడ వుండి, యతిసాహసంబునఁ దదను రాగరజ్జువుం దెంపుకొని, నిలింపపతి యహల్యాకాంతను వీడ్కొని యుటజంబు వెలువడి వచ్చునెడ, నతనిముందట గౌతమమునీంద్రుఁ డెదు రేఁగుటయు, మహనీయ తేజోవిరాజితుండును, సురనదీకృతా వగాహనుండును, కరకలితగంగోదక కనత్కమండలుండును, పింగ జటాభారసంగతుండును, పరమతపోధనుండును నగు నమ్మౌని సింహునిం గాంచి, సురకుంజరుండు భయకంపితాత్ముండై యున్నస మయంబున, ౬౩౯

క. కన్నుల నిప్పులు రాలఁగఁ
గ్రన్నన సురపతిని జూచి, గౌతముఁ డనియెన్
మన్నింపఁగ నర్హుండవె
మున్నవలెన్ నీవు సేయు మూర్ఖత దలఁపన్. ౬౮౦

గీ. తప్పుఁ జేసినాఁడ విప్పుడు గావున
లోక మెఱుఁగ శిక్ష నీకుఁ జేతు
ముష్కరుండ వగుట ముష్కహీనుండవై
గర్వ ముడిగి యుండు పర్వతారి! ౬౮౧

గీ. అని శపింప, నింద్రు నండముల్ ధరణిపైఁ
దునిసి రాలె; నంత మునివరుండు
బాయఁదలఁగియున్న జాయను గన్గొని,
యధికకోపుఁ డగుచు ననియె నిట్లు ౬౮౨

ఉ. కోకదీల నిప్డు సురకుంజరుఁ గూడి తవాచ్యమౌ దురా
చార మొనర్చి తీవు మునిజాయలలోపల నిన్నుఁబోలు వా
రేరి? వచింపుమీ? సుగుణహీనవు నిన్ను ననేమి గల్దు; నో
నీరజనేత్ర సూరిజననిందితవై తివి; ధాత్రి నయ్యయో! ౬౮3

ఉ. తోయజగంధి! నీ వొనఁగు తోయము లంటఁగ రాదు; గూడి నీ
తో యజనాదికృత్యములు తొల్లిటిభంగి నొనర్పరాదు; ని
న్నే మెడఁ దల్పరాదు; మదికింపుగ నిన్గని పల్కరాదు; నిన్
బాయఁగరాదు దుష్కృతము; భామిని మాటలు వేయు నేటికిన్.

క. సుగుణంబులగని మగనికిఁ
దగుమగువ యటంచు మున్ను దగువారలలోఁ
బొగడొందుచుండి, యిట్టులు
దగనిపనుల్ సేతునీకుఁ దగునే తరుణీ! ౬౮౫

గీ. హాటకటాక్షంబు గలవారి కవనిలోన
భూరిసంసారబంధముల్ పోవునట్లు

హరి కటాక్షంబు నేఁడు నీ కబ్బెఁ గాన
బహుళసంసారబంధంబుఁ బాయు సబల ! ౬౮౬

క. సబలారాతివటంచున్
ప్రబలతపశ్శక్తిగంటి పటుమతిచే ని
న్నబలారాతినిగాఁ జే
సి, బహుస్తుతి గాంతు నే నశేషజ్ఞులచేన్. ౬౮౭

వ. అని పలికి కోపోద్రేకంబున. ౬౮౮

క. భాషింపరాని దుస్తర
దోషముఁ జేసితివి; ఖగుల దుర్మతి వగుటన్
రోషా ! నీ విచ్చోటన్
పాషాణమ వగుచుమనుము బహువత్సరముల్. ౬౮౯

చ. అనిశపియించి, క్రమ్మఱ నహల్యను గాంచి మునీంద్రుఁ డాత్మలోఁ
గనికరమూని, రామ ! విను, కంజహితాన్వయవార్ధిసోముఁ డ
త్యనఘుఁడు రామచంద్రుఁడు దయాత్ముఁడు నిన్గన నేఁగుదెంచు ని
వ్వని కెపు డప్డు శాపము నివారితమౌ తదనుగ్రహంబునన్. ౬౯౦

క. నీలోపల బెగడకు మన
నీలోపలమై యహల్య నేలంబడెఁ ద
త్కాలమున గౌతముఁడు హిమ
శైలాగ్రంబునకుఁ దపము సలుపఁగఁ జనియెన్. ౬౯౧

వ. అంత. ౬౯౨

చ. అమరులపాలి కేఁగి, దివిజాధిపుఁ డిట్లను; వేల్పులార ! గౌ
తముఁడు మహోగ్రమౌ తపముఁ దానొనరింపఁగఁ దత్తపంబు నే
నమరహితంబుగాఁ జెఱుప నాత్మఁ దలంచుచు నేఁగి, తన్మనః
కమలము నొంప, నన్విఫలుగా శపియించె మునీంద్రుఁ డల్కచేన్.

గీ. అటుశపించిన నాదర్ప మడఁగె విూరు
విఫలుఁడగు నన్ను సఫలుఁ గావింపుఁ డన్న

సురలు పితృదేవతల నెల్లఁ జూచి, వారికి
నెలమి మేషాండములు గూర్పవలయు మీరు.

క. అన విని పితరులు సురలం
గని, మీరలు సెప్పినట్ల గావింతుము మే
మని, మేషాధిపు కార్యం
బని మేషాండములు దెచ్చి, యదికిరి హరికిన్.

వ. నాఁటనుండి యింద్రుండు మేషాండుండయ్యె; నిది గౌతమాశ్రమ
బివ్వనంబునఁ బతిద త్తశాపత ప్తమానసయగు సహల్యాశిలారూపధ
ణియై భవద్దర్శనంబుఁ గోరియున్నది; గావున రఘువరా! యచ్చో
నీ వరిగి, యమ్మునిసతిని శాపరహితం జేయుమని పల్కిన, వల్లెయ
కృపాసాంద్రుండగు రామచంద్రుండు విశ్వామిత్ర లక్ష్మణ సహిత
డగుచుఁ దదాశ్రమంబుఁ బ్రవేశించె; నయ్యవసరంబున.

చ. వనజదళాక్షుఁడైన రఘువర్యుని రాక విహీనపాపయై,
యనుపమభాగ్యయై, నిజశిలాకృతి వీడి, నిరస్తఖేదయై,
తనను మేనికాంతులను దద్వన మెల్ల వెలుంగఁ జేయుచుఁ
గనకశలాకయో యనఁగఁ గన్పడె గౌతమకాంత వింతగాన్

సీ. రామలక్ష్మణులంత రయమునఁ బావని
యగు నా యహల్యపాదాబ్జములకు
మ్రొక్కిన వారల ముదముతో దీవించి,
పతిపల్కు వాక్యముల్ భావమునను
దలఁచుచు, నతిథిసత్కారంబు గావించి,
సన్నుతించుచు నుండ, సరగ సురలు
కుసుమవర్షము వేడ్కఁ గురియించి; రట దివ్య
భూరిభేరీస్వనంబులు సెలంగె;

గీ. సకల దివిజులు సనుదెంచి సాధురీతి
నయ్యహల్యను వినుతించి యరిగి; రంత
గౌతముఁడు వచ్చి, తనభార్యఁ గదిసి, మదిని
సమ్మదంబున నారామచంద్రుఁ బొగడె.

ఆంధ్రసాహిత్యపరిషత్తు - ప్రతిష్ఠాపకులు.

శ్రీశ్రీ మహారాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు పిఠాపురము మహారాజావారు. పరిషద్వ్యవస్థాపాధ్యక్షులు.

కీ. శే. శ్రీ వేంకటగిరి మహారాజావారు.

కీ. శే. శ్రీ బొబ్బిలి మహారాజావారు.

ఉద్ధారకులు.

శ్రీరాజా వేంకటాద్రి అప్పారావుబహద్దరువారు- ఉయ్యూరు జమీందారువారు.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యనిర్వాహకసభావర్గము.

కార్యనిర్వాహకసభాధ్యక్షులు.

కళాప్రపూర్ణ జయంతి రామయ్యపంతులుగారు, బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

కిళాంబి రాఘవాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

వింజమూరి వెంకన్నపంతులుగారు, ఎం. ఏ.

కార్యనిర్వాహకసభాసభ్యులు

దివాన్ బహద్దర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయుఁడుగారు (కోశాధ్యక్షులు)

పెద్దాడ రామస్వామిగారు, ఎం. ఏ.

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

సాహిత్యవిశారద కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు.

కోకా శివనాథశాస్త్రిగారు,

నిడుదవోలు వేంకటరావుగారు, బి. ఏ.

అకెళ్ళ వెంకట్రామయ్యగారు.

కేశవరపు కామరాజుగారు.

పిళ్ళారిసెట్టి రంగబ్రహ్మరావునాయుఁడుగారు.

ప్రతివాదిభయంకరం పార్థసారథిగారు, బి. ఏ., ఎల్. ఎల్. బి.

మంచితరుణము !! మంచితరుణము !!

శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు

ద్వితీయ సంపుటము.

ముద్రితమై విక్రయమునకు సిద్ధముగా నున్నది.

ఈ సంపుటమున 'క' మొదలు 'జ' వఱకు శబ్దములున్నవి.

సాదాప్రతి మూల్యము 4-0-0. మేలుప్రతి (Art paper) 5-0-0.

పోస్టువ్యయము ప్రత్యేకము. వర్తకులకు కమీషను ఈయబడును.

లక్షణసారసంగ్రహము.

చిన్నకోట పెద్దనకవిచే రచింపఁబడినది. చిరకాలమునుండి కాలగర్భమున నణఁగియున్న యీ యమూల్యమైన లక్షణగ్రంథము నేఁటికి వెలువడినది. ఇది విపులమగు పీఠికలతోఁ గూడి చక్కఁగ ముద్రింపఁబడినది. డెమ్మీసైజు. పుటలు 146. మూల్యము 0-8-0 మాత్రమే.

కావ్యాలంకారచూడామణి.

పాఠభేదములు.

పరిషత్పుస్తక భాండాగారము నందలి వ్రాఁతప్రతులలోని పాఠముల నెత్తి ముద్రితపాఠములతో పాటు ముద్రించినారము. ఈ గ్రంథము పరీక్షార్థులకు, విమర్శకులకు విశేషముగ నుపయోగించును.

వెల 0—6—0 మాత్రమే.

Printed by N. Achutaramiah at the Cocanada Printing Works Cocanada and Published by K. Raghavacharyulu, Secretary, Telugu Academy, Cocanada.